గురువారం
20-07-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 29
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కంబోడియా, అల్జీరియాతో
చైనా దౌత్యానికి 65 ఏళ్లు

అల్జీరియా, కంబోడియా దేశాలతో చైనా దౌత్యబంధానికి 65ఏళ్లు అయ్యాయి. ఈ సందర్భంగా కంబోడియా రాజు నోరోడమ్ శిహామొనికి శుభాకాంక్షలు తెలుపుతూ సందేశాన్ని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ బుధవారం పంపారు. తమ దౌత్యబంధం అనేక ఒడిదుడుకులను నిలద్రొక్కుకున్నదని, మరింత బలపడిందన్నారు.

2 లో

ఇక మంటలేనా?

నేటి నుంచి పార్లమెంటు

- అస్త్రశస్త్రాలతో అధికార, విపక్షాలు
- మణిపూర్, అధిక ధరలు, ఢిల్లీ ఆర్డినెన్స్‌పై చర్చకు విపక్షాల పట్టు
- 31 కొత్త బిల్లులు ప్రవేశపెట్టనున్న కేంద్రం

న్యూఢిల్లీ: పార్లమెంటు వర్షాకాల సమావేశాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం అధికార, విపక్షాలు అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకున్నాయి. మణిపూర్ హింసాకాండ, ధరల పెరుగుదల, ఢిల్లీ ఆర్డినెన్స్ వంటి అనేక ప్రజాసమస్యలపై ప్రతిపక్షాలు మోదీ సర్కారును నిలదీయడానికి సమాయత్తమయ్యాయి. కేంద్రం కూడా అంతే దీటుగా స్పందించాలని నిర్ణయించుకుంది. తాజాగా విపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చి కూటమిగా ఏర్పడి మంచి ఉత్సాహంగా ఉండగా...బీజేపీ కూడా ఎన్‌డీఏ పక్షాల సమావేశంతో ఎదురుదాడికి సిద్ధమైనట్లు కనిపిస్తోంది. ఆగస్టు 11వ తేదీతో ముగియనున్న ఈ సమావేశాల్లో 17 సిట్టింగ్స్ ఉంటాయి. మోదీ నిరంకుశత్వం, ప్రతిపక్షాలపై దాడులు, ఈడీ, సీబీఐ వంటి సంస్థల దుర్వినియోగం, పార్టీలను చీల్చే యత్నాలు, ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చేయడం, కక్షసాధింపు రాజకీయాలు వంటి అంశాలపై పార్లమెంటు

- మిగతా 2 లో

సబ్సిడీ అంతంతే

3 గంటలే పరిమితం

- టమాటాల కోసం రైతు బజార్లలో మహిళల క్యూ
- ధరల నియంత్రణలో జగన్ సర్కారు వైఫల్యం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి : వినియోగదారుడిపై టమాటా ధర మోత మోగిపోతోంది. ఇటీవల కాలంలో భారీగా ధర పెరిగిన టమాటాను కొనుగోలు చేయడం సామాన్యులకు పెనుభారంగా మారింది. పెరిగిన టమాటా ధరకు ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ సమయాలు అందరికీ తెలియక నష్టపోతున్నారు. రెండు లేదా మూడు గంటల పాటే సబ్సిడీ ధరతో టమాటాను విక్రయిస్తూ ప్రభుత్వం చేతులు దులుపుకుంటోందన్న విమర్శలున్నాయి. విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి తదితర నగరాల్లోని ప్రధాన రైతు బజార్లలో ప్రభుత్వం సబ్సిడీ ధరకు టమాటా విక్రయాలను మొక్కుబడిగా ప్రారంభించింది. విజయవాడలో మాత్రం ఉదయం

- మిగతా 2 లో

నేడు విపక్ష కూటమి
తొలి భేటీ

పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో వ్యూహంపై చర్చ

న్యూఢిల్లీ: పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో అనుసరించాల్సిన ఉమ్మడి వ్యూహాన్ని రూపొందించేందుకు ప్రతిపక్ష కూటమి 'ఇండియా' తొలి సమావేశం గురువారం జరగనుంది. రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖడ్గే ఛాంబర్‌లో ఈ సమావేశం జరుగుతుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. వర్షాకాల సమావేశాల మొదటి రోజు నుంచి పార్లమెంటులో లేవనెత్తాల్సిన అంశాలపై చర్చించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రతిపక్ష నేత ఒకరు తెలిపారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జులై 20న ప్రారంభమై ఆగస్టు 11న ముగుస్తాయి. 26 ప్రతిపక్ష పార్టీలు మంగళవారం సంకీర్ణాన్ని ఏర్పాటు చేశాయి. ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయన్స్ (ఇండియా) అధికార ఎన్‌డీఏను ఐక్యంగా ఎదుర్కొంటోందని, ఈ పోరాటం 'ఇండియా–ప్రధాని నరేంద్ర మోదీ మధ్యే' ఉంటుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెప్పారు. మంగళవారం బెంగళూరులో ముగిసిన

- మిగతా 2 లో

రాష్ట్ర భవిష్యత్తు కోసం భూములిస్తే
కౌలు డబ్బులు ఇవ్వరా?

రైతులు పేదవాళ్లుగా కనబడట్లేదా
అమరావతి రాజధాని రైతుల ఆగ్రహం

విశాలాంధ్ర–విజయవాడ (గాంధీనగర్): పేదల సీఎం అని చెప్పుకుంటున్న జగన్‌మోహన్ రెడ్డి పేద రైతులకు అన్యాయం చేస్తున్నారని అమరావతి రాజధాని రైతులు మండిపడ్డారు. రాజధానిలోని ఎస్సీలు పేదవాళ్లుగా కనబడట్లేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని నమ్మి రాజధాని కోసం భూములిస్తే అమరావతి రైతులను రోడ్డున పడేస్తారా అని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వార్షిక కౌలు చెల్లింపులను నిలిపేయడంపై అమరావతి రాజధాని ఐక్య కార్యాచరణ సమితి జేఏసీ అధ్యక్షులు పువ్వాడ సుధాకరరావు అధ్వర్యంలో బుధవారం విజయవాడ ధర్నా చౌక్ వద్ద రైతులు మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు అనేక రాజకీయ, ఇతర సంఘాల నాయకులు వచ్చి సంఘీభావం తెలిపారు. రైతు నాయకులు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

- మిగతా 2 లో

సెతల్వాడ్‌కు సుప్రీం బెయిల్

న్యూఢిల్లీ: గోద్రా అల్లర్ల నేపథ్య కేసులో సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాడ్‌కు బెయిల్ మంజూరు చేస్తూ బుధవారం సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది.

సాధారణ బెయిల్ కోసం ఆమె చేసుకున్న ఫిర్యాదును తిరస్కరిస్తూ గుజరాత్ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ ఏఎస్ బొప్పన్న, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం కొట్టివేసింది. సెతల్వాడ్‌పై చార్జిషీటు నమోదైందని, ఆమెను కస్టడీలో విచారించాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఆమె పాస్‌పోర్టు సెషన్స్ కోర్టు వద్ద ఉందని, సాక్షులను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించబోరని, వారికి దూరంగా ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ కేసులో సాక్షులను ప్రభావితం చేసేందుకు ప్రయత్నాలు జరిగితే నేరుగా సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించేలా గుజరాత్ పోలీసులకు అనుమతిచ్చిస్తూ సెతల్వాడ్‌కు బెయిల్ మంజూరు చేసింది. సెతల్వాడ్ గతేడాది జూన్ 25న అరెస్టు అయిన విషయం విదితమే.

ఫీజు కడితేనే... పరీక్ష

2 లో

సోషలిజంతోనే న్యాయం

కేప్‌టౌన్: పెట్టుబడిదారీ విధానం ఉన్నంత వరకు ప్రజలకు న్యాయం జరగదని, మానవాళి సమస్యలకు ఎటువంటి పరిష్కారం లభించదని వక్తలు ఉద్ఘాటించారు. ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు, సంక్షోభాలకు పరిష్కారం చూపలేని అసమర్థత, వైఫల్యాలతో కేపిటలిజం హింసాత్మకంగా మారిందన్నారు. కేపిటలిజాన్ని సోషలిజం జయిస్తుందని ఆకాంక్షించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయానికి ఇదే మార్గమని వక్తలు నొక్కిచెప్పారు. ఆఫ్రికాలోనే కాదు ప్రపంచంలో సోషలిజాన్ని నిర్మిద్దామని సంకల్పించారు. దక్షిణాఫ్రికాలో ఈనెల 17-20 తేదీల్లో జరిగిన సోషలిజం నిర్మాణం- 'డైలెమాస్ ఆఫ్ హ్యుమానిటీ' సదస్సులో ఆఫ్రికావ్యాప్తంగా ఉన్న 40కుపైగా ప్రగతిశీల ప్రజా ఉద్యమాలు, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. 'మానవాళి సమస్యలను లేవనెత్తడమంటే యుద్ధం చేయాలని, బుల్లెట్లు, బాష్పవాయువు, కోర్టులు, జైళ్లు, అబద్ధాలు, దూషణలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఊహించలేదు. ఇతరులు ధనవంతులయ్యేందుకు మనల్ని పేదలుగా మార్చారని తెలుసుకున్నాం. ఈ భూమ్మీద కేపిటలిజం అంతమైతే తప్ప న్యాయం జరగదు. సోషలిజం లేదా కమ్యూనిజంతో అందరికీ న్యాయం జరుగుతుంది. ఇందుకోసం క్షేత్రస్థాయి నుంచి పని జరగాలి' అని దక్షిణాఫ్రికా సోషలిస్ట్ మిలిటెంట్ షాక్ డ్వెల్లర్స్ మూవ్‌మెంట్ అధ్యక్షుడు జికోడె అన్నారు. పటిష్ట సంస్థల నిర్మాణ బాధ్యత మనపై ఉంది. ప్రజల విషయంలో రాజీ ఉండదు. మన సార్వభౌమత్వం, హక్కులను మనమే నిర్ణయిస్తాం. ఎక్కడా రాజీ పడబోం' అని ఆయన పిలుపునిచ్చారు. దక్షిణాఫ్రికా ఎన్‌యూఎంఎస్‌ఏ జాతీయ ప్రధాన కార్యదర్శి ఇర్విన్ జిమ్ మాట్లాడుతూ ఐక్యత ప్రాధాన్యతను వివరించారు. అణచివేత, దోపిడీ రహిత ప్రపంచాన్ని నిర్మించుకుందామని పిలుపునిచ్చారు. శ్రామిక వర్గం కోసం కావాల్సినది ఓ రొట్టె ముక్క కాదు మొత్తం బేకరీ అని నొక్కిచెప్పారు.

బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, అమెరికా దేశాల పక్షాన్న ఆఫ్రికా యుద్ధాలు చేయదన్నారు.'మన పోరాటాలను మనమే పోరాడదాం. మనం పోరాడేది ఆహారం, విద్యా, ప్రజారోగ్యం, నాణ్యమైన వైద్యం, సామ్రాజ్యవాదం అంతం, సారమాజ్యవాద నిరంకుశత్వానికి గురవుతున్న ప్రపంచానికి విముక్తి కల్పించే ఐక్య పోరాటం కోసమన్నారు. తాము చేసేది అంతర్జాతీయ పోరాటమని, మెరుగైన ప్రపంచ నిర్మాణమే తమ ఆశయమని అన్నారు.

కంబోడియా, అల్జీరియాతో చైనా దౌత్యానికి 65ఏళ్లు

బీజింగ్: అల్జీరియా, కంబోడియా దేశాలతో చైనా దౌత్యబంధానికి 65ఏళ్లు అయ్యాయి. ఈ సందర్భంగా కంబోడియా రాజు నోరోడమ్ శిహామొనికి శుభాకాంక్షలు తెలుపుతూ సందేశాన్ని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ బుధవారం పంపారు. తమ దౌత్యబంధం అనేక ఒడిదుడుకులను నిలద్రొక్కుకున్నదని, మరింత బలపడిందన్నారు. ఉత్తమ ప్రమాణాలు, ఉన్నత స్థాయి భవిష్యత్ ప్రణాళికలతో రెండు దేశాల మధ్య 'డైమెండ్ హెగ్జాగన్' సహకారంతో రాజకీయాల్లో, తయారీ రంగంలో, వ్యవసాయం, ఇంధనం, భద్రత రంగాల్లో కలిసి ముందుకు సాగుదామని జిన్‌పింగ్ పేర్కొన్నారు. జిన్‌పింగ్ అంతకుముందు గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్‌లో అల్జీరియా అధ్యక్షుడు అబ్దెల్ మజీద్ టెబ్బోర్నెతో భేటీ అయ్యారు. ద్వైపాక్షిక చర్చలు జరిపారు. రెండు దేశాల మధ్య దౌత్యం మొదలై 65 ఏళ్లు అయిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. సామ్రాజ్యవాదాన్ని, వలసవాదాన్ని తిప్పికొట్టేందుకు రెండు దేశాలు చేతులు కలిపాయని గుర్తుచేశారు. పరస్పర సహకారంలో, గౌరవంతో మంచి మిత్రదేశాలుగా, సహజ భాగస్వాములుగా కొనసాగినట్లు తెలిపారు. మైత్రిని, చైనా-అల్జీరియా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింతగా ముందుకు తీసుకెళ్లేందుకు చైనా కట్టుబడి ఉందని జిన్‌పింగ్ చెప్పారు. ఆర్థిక, సామాజిక అభివృద్ధికి అల్జీరియాకు సహకరించేందుకు, దిగుమతులు, వాణిజ్య సహకారాన్ని పెంపొదించేందుకు చైనా కట్టుబడి ఉందని చెప్పారు.



అల్జీరియాకు మొదటిసారి చైనా వైద్య బృందాన్ని పంపి 60 ఏళ్లు అయ్యిందని, ఆరు దశాబ్దాల్లో 3,522 మంది చైనా మెడికల్ వర్కర్లు ఆ దేశానికి వెళ్లి 27 మిలియన్ల మందికి వైద్య సేవలు అందించారన్నారు. ఐరాస భద్రతా మండలిలో 2024-25లో తాత్కాలిక సభ్యత్వం పొందినందుకు అల్జీరియాకు జిన్‌పింగ్ శుభాకాంక్షలు తెలిపారు.

అల్జీరియా అధ్యక్షుడు టెబ్బోర్నె మాట్లాడుతూ చైనా తమకు మంచి మిత్ర- భాగస్వామి దేశమన్నారు. దశాబ్దాలుగా తమకు గణనీయమైన తోడ్పాటును అందించినందుకు కృతజ్ఞులు తెలిపారు. తైవాన్, జిన్‌జాంగ్ వంటి అంశాల్లో చైనాకు మద్దతిస్తామని చెప్పారు. చైనా గ్లోబల్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్, గ్లోబల్ సెక్యూరిటీ - గ్లోబల్ సివిలైజేషన్ ఇనిషియేటివ్‌లకూ మద్దతిస్తామన్నారు. బెల్డ్ &రోడ్‌కు సహకరిస్తామన్నారు.

పెరూలో మిన్నంటిన నిరసనలు

దీనా రాజీనామాకు డిమాండ్- రోడ్లపైకొచ్చిన వేలాది మంది

లిమా: పెరూలో ప్రజానిరసనలు మిన్నంటాయి. అధ్యక్ష పదవికి దీనా బొల్వార్టె రాజీనామా చేయాలని ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. పెడ్రో కాస్టిల్లో ప్రభుత్వంపై తిరుగుబాటు క్రమంలో 2022 డిసెంబరులో దీనా అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించారు. ఆ రోజు నుంచి ప్రజా నిరసనలు కొనసాగుతున్నాయి. ఇదే క్రమంలో కార్మిక - కర్షక సంఘాలు, వామపక్షాలు, ప్రజా సంఘాల పిలుపు మేరకు బుధవారం 'థర్డ్ టేకోవర్ ఆఫ్ లిమా' పేరిట రాజధాని లిమాలో నిరసన జరిగింది. నగర వీధులన్నీ నిరసనకారులతో కిక్కిరిసిపోయాయి. వేలాది మంది కార్మికులు, విద్యార్థులు, కర్షకులు, లెఫ్ట్ కార్యకర్తలు పాల్గొన్నారు. తిరుగుబాటు జరిగి ఏడు నెలలకుపైగా అయింది. అయినాగానీ ప్రజల డిమాండ్లను దీనా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, స్పందించడం లేదని పెరూ రాజకీయ కార్యకర్త లూసియా అల్విటెస్ అసహనం వ్యక్తంచేశారు. పెరూ ప్రజలు దీనా బలొర్టె తక్షణమే రాజీనామాతో పాటు కాంగ్రెస్‌ను రద్దునకు డిమాండ్ చేస్తున్నారు. కొత్త రాజ్యాంగ ఒప్పందం అంటే ప్రజల వాణిని ప్రతిబింబింపజేసే విధంగా కొత్త రాజ్యాంగం కోసం కూడా వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ మూడు డిమాండ్లకు అన్ని వర్గాల ప్రజల నుంచి మద్దతు లభిస్తోంది. దీనా నిరంకుశ పాలనకు వ్యతిరేక పెరుగుతోంది. తమ డిమాండ్ల సాధన కోసం ప్రజలు ఉద్యమిస్తున్నారు. ఇప్పటివరకు 70 మందికిపైగా పోలీసుల తూటాలకు బలయ్యారు. మానవహక్కుల ఉల్లంఘనలు, అక్రమ అరెస్టుల వంటివాటికి లెక్క-పద్దు లేకుండా పోయిందని నిరసనకారులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజలు మెచ్చే పరిపాలన కోసం పోరాటాన్ని ఉధృతం చేస్తామని దీనా ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు.

పుతిన్‌ను అరెస్టు చేస్తే రష్యాతో యుద్ధం తప్పదు: రమపోస

దర్బన్: అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసీసీ) అరెస్ట్ వారెంట్ ఆధారంగా దక్షిణాఫ్రికాలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను అరెస్ట్ చేస్తే ఆ దేశంతో యుద్ధం ప్రకటించినట్లేనని దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమసోస అన్నారు. ఇదే విషయాన్ని గతంలో రష్యా స్పష్టంచేసిందన్నారు. పుతిన్ వ్యవహారంలో ప్రతిపక్ష డెమోక్రటిక్ అలయెన్స్ స్థానిక కోర్టులో వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సమర్పించిన అఫిడవిట్‌లో రమసోప ఈ మేరకు పేర్కొన్నారు.

రష్యాతో యుద్ధం చేయడం దక్షిణాఫ్రికా రాజ్యాంగానికి విరుద్ధమని కూడా కోర్టుకు తెలిపారు. ఈ నిర్ణయం రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి నెలకొల్పాలన్న దక్షిణాఫ్రికా ప్రయత్నాలకు విఘాతం కలిగిస్తుందని చెప్పారు. ఆగస్టులో జొహనెస్‌బర్గ్‌లో జరగబోయే బ్రిక్స్ సదస్సుకు పుతిన్ హాజరుకానున్న నేపథ్యంలో ఐసీసీ సభ్యదేశంగా దక్షిణాఫ్రికా పుతిన్‌ను అరెస్టు చేయాల్సి ఉండగా అందుకు తిరస్కరిస్తూ రమపోస గతంలో ఓ ప్రకటన చేశారు.

సబ్సిడీ అంతంతే

(మొదటిపేజీ తరువాయి)

8 గంటల నుంచి 10 గంటల వరకే సబ్సిడీ ధర అమలులో ఉంటోంది. ఆ సమయంలో వచ్చిన వారికే కిలో చొప్పున విక్రయిస్తున్నారు. టమాటా రూ.100 ఉంటే, దానికి సబ్సిడీ కింద రూ.50కే అందిస్తున్నారు. 10 గంటల తర్వాత వచ్చిన వారికి మళ్లీ కిలో రూ.100 లేదా అంత కంటే ఎక్కువగా బయట మార్కెట్‌లో తరహాగా విక్రయిస్తున్నారు. ఇదే విధానం మిగిలిన నగరాల్లోనూ అమలవుతున్నట్లు తెలిసింది. టమాటా విక్రయాలపై ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో జగన్ ప్రభుత్వం విఫలమైంది. పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తరపున సబ్సిడీ అమలు చేస్తున్నామంటూ ప్రచారం చేయడం లేదు. దీనివల్ల సామాన్యులకు సమాచారం తెలియక ఆర్థికంగా నష్టపోతున్నారు. చాలా రోజులుగా టమాటా ధర మార్కెట్‌లో రూ.100 నుంచి రూ.150కు ఎగబాకింది. ప్రస్తుతం ఈ ధర రూ.100 నుంచి రూ.110గా ఉంది. ప్రజలకు నిత్యవసర వస్తువుగా టమాటా ఉంది. ప్రతి కూరలోనూ దీనిని వేస్తారు. దీంతో టమాటా లభించక, గృహిణులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. రైతు బజార్ల దగ్గర ఉదయం నుంచే పడిగాపులు పడుతున్నారు.

వినియోగదారుల అవస్థలు

సబ్సిడీ ఇచ్చే రైతు బజార్ల దగ్గర గంటల కొద్దీ వినియోగదారులు బారులుదీరి నిల్చొని ఉండాల్సిన దుస్థితి నెలకొంది. కొంతకాలంగా టమాటా ధర విపరీతంగా పెరుగుతున్నప్పటికీ, దానిని నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేదలకు ఇచ్చే సబ్సిడీని ప్రభుత్వం పూర్తిగా భరించే పరిస్థితుల్లో లేదు. ఇప్పటికే విశాఖపట్నంతో పాటు చాలా ప్రాంతాల్లో సబ్సిడీ ధరను ప్రభుత్వం తొలగించినట్లు తెలిసింది. సబ్సిడీ ధరకు విక్రయించే టమాటా స్టాక్ లేదంటూ బోర్డులు పెడుతున్నారు. అదే మార్కెట్ ధరకు విక్రయించే టమాటా గుట్టలు గుట్టలుగా పేర్చి విక్రయానికి సిద్ధంగా ఉంచుతున్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ విధానంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతు బజార్లలో తక్కువ ధరకు విక్రయించకుండా, బయట మార్కెట్ ధరకు విక్రయించడాన్ని తప్పుపడుతున్నారు. ఇటీవల సీఎం జగన్ నిర్వహించిన సమీక్షలో రాష్ట్ర ఖజానా నిండుగా ఉందంటూ ఆర్భాటంగా ప్రకటించారు. నిత్యావసర సరుకైన టమాటా ధరకు పూర్తి స్థాయిలో సబ్సిడీ ఇచ్చి, ప్రభుత్వం ఎందుకు అందుబాటులోకి తేవడం లేదంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

నేడు విపక్ష కూటమి తొలి భేటీ

(మొదటిపేజీ తరువాయి)

రెండు రోజుల 26 ప్రతిపక్ష పార్టీల సమావేశంలో పార్లమెంటులో 'ఇండియా' విపక్షాల సమూహం అనుసరించాల్సిన వ్యూహం చర్చనీయాంశంగా ఉందని ఆ వర్గాలు తెలిపాయి. పార్లమెంటులో ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టదలిచిన అంశాలపై సమన్వయం చేసుకోవాలని అఖిలపక్ష నేతలు ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

'ఇండియా' అనే ఈ కొత్త కూటమిలో కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే, ఆప్, జేడీ(యూ), ఆర్‌జేడీ, జేఎంఎం, ఎన్‌సీపీ (శరద్ పవార్), శివసేన (యూబీటీ), ఎస్‌పీ, ఎన్‌సీ, పీడీపీ, సీపీఐ, సీపీఎం, ఆర్ఎల్‌డీ, ఎండీఎంకే, కొంగునాడు మక్కల్ దేశాయ్ కట్చి (కేఎండీకే), వీసీకే, ఆర్ఎస్‌పీ, సీపీఐ(ఎంఎల్)-లిబరేషన్, ఫార్వార్డ్ బ్లాక్, ఐయూఎంఎల్, కేరళ కాంగ్రెస్ (జోసెఫ్), కేరళ కాంగ్రెస్ (మణి), అప్నా దళ్ (కామెరవాడి), మనితనేయ మక్కల్ కట్చి (ఎంఎంకే) ఉన్నాయి.

26 పార్టీలు లోక్‌సభలో దాదాపు 150 స్థానాలను కలిగి ఉన్నాయి. దిల్లీ, 10 రాష్ట్రాల్లో వ్యక్తిగతంగా లేదా కూటమిలో అధికారంలో ఉన్నాయి.

ఇక మంటలేనా?

(మొదటిపేజీ తరువాయి)

సమావేశాలు వేడెక్కనున్నాయి. ఉమ్మడి వ్యూహంతో పార్లమెంటును కుదిపివేయాలనేంత కసితో ప్రతిపక్షాలు ఉన్నాయి. ఏడాది చివరిలో కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాదిలో సార్వత్రిక ఎన్నికలు జరగనుండటంతో అధికార-విపక్షాలు తమకున్న అన్ని అస్త్రాలకు పదును పెడుతున్నాయి. మణిపూర్‌లో రగిలిన అగ్ని కీలల వేడి పాలకులకు తాకేలా చేయబోతున్నాయి. ఈశాన్య రాష్ట్ర పరిస్థితులపై చర్చ విషయంలో రాజీ పడేది లేదని కేంద్ర ప్రభుత్వానికి స్పష్టంచేశాయి. దిల్లీలో అధికారుల బదిలీ/నియామకాల అధికారాల ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తామని ప్రకటించాయి. దిగిరాని నిత్యావసరాల ధరలు, పెరిగిపోతున్న నిరుద్యోగం వంటి అనేక అంశాలతో పార్లమెంటు సమావేశాల అజెండాను సిద్ధం చేశాయి. 'ఇండియా'గా 26 పార్టీలు కలిసి మోదీ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టనున్నాయి. ఎన్నికైన రాష్ట్రాల హక్కులను, అధికారాలను హరించే విధంగా దిల్లీ ఆర్డినెన్స్ ఉందని, ఇది రాజ్యాంగానికి విరుద్ధమని ఆప్‌తో పాటు అనేక పార్టీలు మోదీ సర్కారుపై దుమ్మెత్తిపోస్తున్నాయి. దీంతో మొదట ఇదే బిల్లును చట్టసభల్లో ప్రవేశపెడతారన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. తాము ప్రభుత్వానికి సహకరించే విధంగా సానుకూల దృక్పథంలో పార్లమెంటు సమావేశాలకు వస్తామని, సభలు సజావుగా జరిపించడం ప్రభుత్వం బాధ్యత అని ప్రతిపక్షాలు తేల్చాయి. నచ్చితే తీసుకోండి లేదంటే వదిలేయండి అనే వైఖరి, నా దారి రహదారి అన్న పద్ధతిని విడనాడి ప్రజా సంబంధమైన కీలకాంశాలపై చర్చకు కేంద్రం సిద్ధంగా ఉండాలని హితవు పలికాయి. ప్రతిపక్షాలది ఉమ్మడి వ్యూహమని, తాము వేసే ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చేందుకు సర్కార్ సిద్ధంగా ఉండాలని, మణిపూర్‌పై ఇప్పటివరకు పెదవి విప్పని ప్రధాని... ఆ అంశంపై చర్చకు తప్పక హాజరు కావాలని కోరాయి. ఇదిలావుంటే, మొత్తం 31 కొత్త బిల్లులను ఈసారి సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధమైంది. డిజిటల్ వ్యక్తిగత సమాచార పరిరక్షణ బిల్లు, జనన-మరణాల (సవరణ) బిల్లు వంటి కొన్ని కీలక బిల్లులు ఉభయసభల ఆమోదం కోసం రాబోతున్నాయి. జాతీయ నర్సింగ్ కమిషన్ బిల్లును సమావేశాల మొదటి రోజు కేంద్ర ఆరోగ్యమంత్రి మన్సుక్ మాండవియా ప్రవేశపెట్టనున్నారు. 1948 నాటి డెంటిస్టుల చట్టం రద్దు, జాతీయ డెంటల్ కమిషన్ ఏర్పాటు కోసం జాతీయ డెంటల్ కమిషన్ బిల్లు లోక్‌సభ ముందుకు రానుంది. ఔషధాలు, వైద్య పరికరాలు, కాస్మెటిక్స్ బిల్లు, పురాతన కట్టడాలు, పురావస్తు ప్రాంతాల (సవరణ) బిల్లు, జాతీయ సహకార విశ్వవిద్యాలయ బిల్లు వంటివి కొత్త బిల్లుల్లో ఉండగా పెండింగ్ బిల్లుల్లో జనవికాస్ బిల్లు ఉంది. కాగా, ప్రభుత్వం బుధవారం నిర్వహించిన అఖిలపక్షం సమావేశానికి 34 పార్టీల నేతలు హాజరయ్యారు.

ప్రవేశపెట్టనున్న బిల్లులు: సినిమాటోగ్రాఫ్ (సవరణ) బిల్లు, 2019, డీఎన్‌ఏ టెక్నాలజీ (వినియోగం) నియంత్రణ బిల్లు-2019, మధ్యవర్తిత్వ బిల్లు 2021, బహుళ రాష్ట్ర సహకార సంఘాల (సవరణ) బిల్లు 2022, రాజ్యాంగ (ఎస్‌టీ) ఆర్డర్ (మూడో సవరణ) బిల్లు 2022, పోస్టల్ సేవల బిల్లు 2023, అంతర్జాతీయ ద్రవ్యనిధి, బ్యాంకు బిల్లు 2023, ప్రొవిషనల్ పన్నుల వసూళ్ల బిల్లు 2023, జమ్ముకశ్మీర్ రిజర్వేషన్ (సవరణ) బిల్లు, ప్రెస్, రిజిస్ట్రేషన్ పీరియాడికల్స్ బిల్లు 2023, న్యాయవాదుల (సవరణ) బిల్లు 2023, గనులు, ఖనిజాలా బిల్లు, రైల్వే (సవరణ) బిల్లు 2023, జాతీయ రీసెర్చ్ ఫౌండేషన్ బిల్లు 2023, రాజ్యాంగం (జమ్ముకశ్మీర్) ఎస్టీలు/ఎస్సీల ఆర్డర్ (సవరణ) బిల్లులు.

ఫీజు కడితేనే... పరీక్ష

- కళాశాల విద్యార్థులపై యాజమాన్యాల ఒత్తిళ్లు
- 'జగనన్న విద్యాదీవెన'లో జాప్యం
- కొందరి ఖాతాల్లోనే డబ్బు జమ
- విద్యార్థుల చదువులకు ఆటంకం

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: 'కళాశాల ఫీజు కట్టాల్సిందే...లేకుంటే సెమిస్టర్ పరీక్ష ఫీజు కట్టించుకోబోం' అంటూ ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు తెగేసి చెబుతున్నాయి. జగనన్న విద్యాదీవెనలో జాప్యం జరగడం విద్యార్థులు, తల్లిదండ్రుల పాలిట శాపంగా మారింది. సకాలంలో ఈ సొమ్ము అందరి తల్లుల ఖాతాల్లోకి జమకానందున వారి చదువులకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. తమకు జగనన్న విద్యాదీవెన వస్తుందనే ఆశతో వివిధ డిగ్రీ కోర్సుల్లో చేరిన కొంతమంది విద్యార్థులకు చుక్కెదురవుతోంది. మొదటి ఏడాది విద్యా సంవత్సరం నుంచి అష్టకష్టాల నడుమ ప్రభుత్వం నిధుల్ని ఆలస్యంగా జమ చేయడం, తిరిగి ఆయా కళాశాలల యాజమాన్యానికి వాటిని ఫీజుల రూపంలో చెల్లించడం పరిపాటిగా మారింది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఇదే పరిస్థితి మొదలైంది. చేసేదేమీ లేక విద్యార్థుల తల్లిదండ్రులు బయట అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి నానా ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యాదీవెన పథకం కింద పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం మూడ నెలలకొకసారి జమ చేస్తోంది. జనవరి, ఫిబ్రవరి, మార్చి 2023 త్రైమాసికానికి రూ.9.95లక్షల మంది విద్యార్థులకు రూ.703 కోట్లను సీఎం జగన్ బటన్ నొక్కి నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి జమ చేసిన విషయం విదితమే. దీనివల్ల ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే పేద విద్యార్థులకు లబ్ధి చేకూరుతోంది. అయితే గడచిన త్రైమాసికానికి సంబంధించిన నిధులు కొందరి తల్లుల ఖాతాల్లోకి జమ కానందున, వారి పిల్లల చదువుల ఫీజులు చెల్లించలేక పోయారు. దీంతో కళాశాలల యాజమాన్యం నుంచి వారిపై ఒత్తిళ్లు విపరీతంగా పెరుగుతున్నాయి. తాజాగా నెల్లూరు జిల్లాలోని గీతాంజలి

ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం ఫీజులు కడితేనే సెమిస్టర్ పరీక్షలకు ఫీజు కట్టేందుకు అనుమతిస్తామంటూ విద్యార్థులకు అడ్డంకులు సృష్టించిన సంఘటన వెలుగులోకి వచ్చింది. దానిపై విద్యార్థులు, తల్లిదండ్రులు, పేరెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు అక్కడకు వెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేశారు.

ఇదే పరిస్థితి చాలా ప్రైవేట్ కళాశాలల్లోనూ నెలకొంది. జగనన్న విద్యా దీవెనతో మాకు సంబంధం లేదని యాజమాన్యాలు స్పష్టం చేస్తున్నాయి. విద్యార్థులు ముందస్తుగా కళాశాల ఫీజు కట్టాలని, అలా కట్టిన వారితోనే సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు అనుమతిస్తామని చెబుతున్నాయి. ఆ మేరకు విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి కమిట్‌మెంట్ లెటర్లు తీసుకుంటున్నారు. అటు అధికారులు మాత్రం సాంకేతిక లోపాల కారణంగానే కొందరి ఖాతాల్లో నిధులు జమ కావడం లేదంటూ దాట వేస్తున్నారు. లబ్ధిదారుగా ఉన్న తల్లి ఆధార్, బ్యాంక్ ఖాతాకు అనుసంధానం సక్రమంగా లేకపోవడం, సమాచారం ఇవ్వకపోవడం వెరసి నిధుల జమపై జాప్యమవుతున్నట్లు చెబుతున్నారు.

పూర్తిగా అందని అమ్మఒడి నిధులు

అమ్మ ఒడి నిధులు కూడా పూర్తిస్థాయిలో లబ్ధిదారులైన తల్లుల ఖాతాల్లోజమ కాలేదు. ఈనెల 22 లోగా తల్లుల ఖాతాల్లో డబ్బులు వేస్తామని వలంటీర్లు చెబుతున్నారు. దీనికి కారణం సాంకేతిక లోపాలని, తల్లుల ఆధార్, బ్యాంకు ఖాతాలకు అనుసంధానం కానందునే ఈ సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు. సీఎం జగన్ అమ్మఒడి నిధులను లాంఛనంగా విడుదల చేసినప్పటికీ అవి పూర్తిగా జమ కాకపోవడం పట్ల తల్లులు ఆందోళన చెందుతున్నారు. అటు జగనన్న వసతి దీవెనలోనూ అక్కడక్కడా జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడకూడా సాంకేతిక సమస్యలే ఎదురవుతున్నాయి. జగనన్న వసతి దీవెన పథకం ద్వారా ఉన్నత చదువులు చదివే పేద విద్యార్థుల భోజన, వసతి ఖర్చుల కోసం ఏటా రెండు వాయిదాల్లో ప్రభుత్వం చెల్లిస్తోంది. ఐటీఐ విద్యార్థులకు రూ.10వేలు, పాలిటెక్నిక్-రూ.15 వేలు, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు అభ్యసించే వారికి రూ.20వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది. ఇది కూడా అందరికీ సకాలంలో రావడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. విద్యార్థుల చదువులకు ఆటంకాలు వస్తాయనే ఆందోళనతో తల్లిదండ్రులు బయట అప్పులు తెచ్చి ఫీజులు కడుతున్నారు.

విద్యార్థుల చదువులకు ఎలాంటి ఆటంకాలు ఎదురవ్వకుడా ఉన్నత విద్యా మండలి నియంత్రణ, పరిరక్షణ కమిషన్ చైర్మన్ స్పందించాల్సిన అవసరముంది. ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన నిధులను వెంటనే విడుదల చేయాలని, అంతవరకు విద్యార్థులను సెమిస్టర్ పరీక్షలకు హాజరయ్యేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

కౌలు డబ్బులు ఇవ్వరా?

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ రాజధాని అమరావతి అని స్వయంగా రాష్ట్రపతి స్పష్టం చేశారని తెలిపారు. భారత రాజ్యాంగం ప్రకారం సుప్రీం కోర్టు తీర్పు శిరోధార్యమని, అయితే ఈ రాష్ట్ర ప్రభుత్వం తీర్పును కూడా అవహేళన చేస్తోందన్నారు. అమరావతిలో సీఆర్‌డీఏ మూడు సంవత్సరాల వ్యవధిలో నివాస స్థలాలను అభివృద్ధి చేస్తామని లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చినప్పటికీ, ఆ విధంగా జరగలేదన్నారు. అమరావతిలో పేదవాడి నుంచి అధికారుల వరకు ఇళ్లు కడతామని ఇప్పటి వరకు పూర్తి చేయలేదని, జగన్‌మోహన్ రెడ్డి పథకాలకు డబ్బులు ఇస్తున్నా దే కానీ రైతులకు కౌలు డబ్బులు ఇవ్వటం లేదని విమర్శించారు. కౌలు కోసం రైతులు రోడెక్కటం చాలా బాధాకరం అన్నారు. వైసీపీ ప్రభుత్వ మూడు రాజధానుల విధానం సాధ్యం కాదని తెలిపారు. రాజధానిలో ఆర్-5 జోన్ అని ఏర్పాటు చేసి ఒక్కొక్కరికి ఒక్క సెంటు ఇస్తున్నారని, కచ్చితంగా అమరావతిలోనే రాజధాని ఉంటుందన్నారు. పోలవరం ప్రాజెక్టును మరుగున పడేశారన్నారు. రాజధాని అమరావతికి తీరని నష్టం చేసిన వారికి రాజకీయ భవిష్యత్తు లేకుండా చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మాజీ మంత్రి దేవినేని ఉమా మాట్లాడుతూ ఈ నాలుగు సంవత్సరాలు సీఆర్‌డీఏ కార్యాలయం వద్ద ధర్నాలు చేస్తేనే రైతులకు కౌలు డబ్బు వేస్తున్నారని, ఇటువంటి దుర్మార్గ ప్రభుత్వం ప్రపంచంలో ఎక్కడా లేదని అన్నారు. మీరు చేసేది ధర్మ పోరాటమని, సీఆర్‌డీఏ ఇచ్చిన ప్రణాళికకు కట్టుబడి ఉండాలని రాజధాని నిర్మాణంపై సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. పేదలకు టిడ్కో ఇళ్లు జగన్‌మోహన్ రెడ్డి ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించారు. సీబీఐ కేసుల్లో ఉన్న పేర్లు సెప్టెంబరులో బయటకు వస్తాయన్నారు. పోలవరం నిర్వాసితులకు రూ.10 లక్షలు ఇస్తామని, ఒక్క రూపాయి ఇవ్వకుండా వారిని గోదావరిలో ముంచారని అన్నారు. మీ పోరాటానికి చంద్రబాబు, టీడీపీ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ నాయకురాలు సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ రాష్ట్ర రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని అన్నారు. హక్కుగా రావాల్సిన కౌలు డబ్బులు కూడా ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని అడుక్కోవాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి రాజధాని నిర్మాణం కోసం రైతులు తమ భూములను ఇచ్చి త్యాగాలు చేశారని, అలాంటి వారికి అన్యాయం చేయరాదని అన్నారు. అమరావతి రాజధాని ఐక్య కార్యాచరణ సమితి జేఏసీ అధ్యక్షులు పువ్వాడ సుధాకరరావు మాట్లాడుతూ ఒకవైపు రాజధాని అభివృద్ధి చేయకపోగా... మరోవైపు పత్రాల సాకుతో వార్షిక కౌలు నిలుపుదల చేశారని రైతులు మండిపడుతున్నారని అన్నారు. తాము కోర్టుకు వెళితే వడ్డీతో కౌలు చెల్లించాల్సి వస్తుందని ప్రభుత్వం గ్రహించాలన్నారు. రాజధానికి భూములిచ్చిన రైతులు 1,310 రోజులుగా ఉద్యమం చేస్తున్నారని గుర్తు చేశారు. అసైన్డ్ రైతులకు కౌలు చెల్లించకుండా ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిలో అధిక శాతం బలహీనవర్గాల రైతులు వారికి ఎకరం నుంచి 3 ఎకరాలు మాత్రమే ఉందని, అటువంటి వారికి కూడా కౌలు ఇవ్వకుండా వేధిస్తున్నారని తెలిపారు. రాజధానిలోని ఎస్సీలు పేదవాళ్లుగా కనబడట్లేదా అని ప్రశ్నించారు. నమ్మి భూములిస్తే అమరావతి రైతులను రోడ్డున పడేస్తారా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ 7 వేల మంది రైతులు తమ భూములను రాజధాని నిర్మాణం కోసం ఇస్తే వారికి కౌలు డబ్బులు ఇవ్వటం లేదని అన్నారు. ప్రభుత్వానికి భూమిని ఇచ్చింది రాష్ట్ర భవిష్యత్తుతో పాటు వారి జీవనాధారం కోసమని తెలిపారు. అక్షరాల 100 కోట్ల రూపాయలను అసైన్డ్ భూముల రైతులకు చెల్లించాలన్నారు. రాజధాని అమరావతి రైతుల ఉద్యమానికి సీపీఐ, కౌలు రైతు సంఘం తరపున పూర్తి సంఘీభావం, మద్దతు ఉంటుందన్నారు. అమరావతి పరిరక్షణ సమితి అధ్యక్షులు శివారెడ్డి మాట్లాడుతూ అమరావతి రాజధాని అసైన్డ్ రైతుల వార్షిక కౌలు నిలుపుదలపై ప్రతిసారి హైకోర్టును ఆశ్రయించవలసిన దుస్థితి ఏర్పడిందన్నారు. అమరావతి కోసం మనం చేసే ఉద్యమం అతి త్వరలో విజయవంతంగా ముగుస్తుందని, రానున్న రోజుల్లో మనకు నచ్చిన ప్రభుత్వాన్ని మనమే ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఈ ధర్నాలో జడ్పీ మాజీ చైర్మన్ గద్దె అనురాధ, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్, తెలుగు యువత గుంటూరు జిల్లా అధ్యక్షులు రాయపాటి సాయికృష్ణ, వెలగపూడి గోపాల కృష్ణ, గడ్డం మార్టిన్ లూథర్, అమరావతి దళిత జేఏసీ కన్వీనర్ పోతుల బాలకోటయ్య, వి.కృష్ణయ్య, దేవినేని అపర్ణ, బి.రాజా, మైనర్ బాబు, మోతులపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరులో ఉగ్ర కుట్ర భగ్నం

- ఐదుగురు తీవ్రవాదుల అరెస్ట్
- లష్కరేతో బంధంపై అనుమానాలు

బెంగళూరు: ఉగ్ర దాడులు చేసేందుకు తీవ్రవాదులుగా మారినట్లుగా అనుమానిస్తున్న ఐదుగురిని సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు అరెస్టు చేసినట్లు బెంగళూరు పోలీసు కమిషనర్ బి.దయానంద్ బుధవారం తెలిపారు. వారి నుంచి మారణాయుధాలు, మందుగుండు సామాగ్రితో పాటు 12 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఉగ్రవాద అనుమానితుల నుంచి ఏడు పిస్టల్స్, 45 లైవ్ కాట్రిడ్జ్‌లు, వాకీటాకీలు, కొన్ని కత్తులను, అలాగే భారీగా పేలుడు పదార్థాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు అధికారి తెలిపారు. 'సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ సంఘ వ్యతిరేక శక్తులను ఛేదించడంలో విజయం సాధించింది. వారి దుర్మార్గపు ఆకృతులను తిప్పికొట్టింది. హెబ్బాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక స్థలంపై దాడి చేసి వారిని అరెస్టు చేశారు' అని దయానంద విలేకరులతో అన్నారు. 2008 బెంగళూరు వరుస బాంబు పేలుళ్ల కేసులో నిందితుడిగా ఉన్న టి.నజీర్, విదేశాలలో నివసిస్తున్న మరో నిందితుడు ఈ ఐదుగురు నిందితులను తీవ్రవాదులుగా మార్చారు. నిందితులపై హత్యలు, దోపిడీలు, ఎర్రచందనం స్మగ్లింగ్‌తో పాటు ఇతర నేరాలకు పాల్పడుతున్నారు. జైలులో ఉన్న ఇతర ఉగ్రవాద నిందితులతో వారు సంప్రదింపులు జరుపుతున్నారు. నజీర్‌కు పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాతో సంబంధాలు ఉన్నాయని పోలీసు కమిషనర్ తెలిపారు. నజీర్ ముఠా సభ్యులు విధ్వంసకర కార్యకలాపాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఐదుగురు నిందితులు నగరంలోని సుల్తాన్‌పాళ్య ప్రాంతంలోని కనకనగర్ ప్రాంతంలోని ప్రార్థనా స్థలం వద్ద పెద్ద కుట్రకు ప్రణాళిక చేస్తున్నప్పుడు పట్టుబడ్డారని వర్గాలు తెలిపాయి. విదేశాల్లో ఉన్న మరో కీలక సూత్రధారి తన వ్యాపార ప్రత్యర్థి నూర్ అహ్మద్‌ను 2017లో హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని, ఆ కేసులో 21 మందిని అరెస్టు చేసినట్లు దయానంద తెలిపారు. ఆ హత్య కేసుకు సంబంధించి అరెస్టయిన 21 మందిలో ఈ ఐదుగురు నిందితులు కూడా ఉన్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి. 'మేము వారిపై చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశాము. కేసును మరింత దర్యాప్తు చేయడానికి వారిని 15 రోజుల కస్టడీకి తీసుకున్నాము' అని ఆయన చెప్పారు. వీరిలో ఎంతమంది ప్రమేయం ఉందో, వారందరికీ ఎవరితో సంబంధం ఉందో తదుపరి విచారణలో వెల్లడవుతుందని ఉన్నతాధికారి వెల్లడించారు. 'విదేశాలలో ఉన్న వారి సహచరుడు ఆయుధాలు, ఇతర పరికరాలతో వారికి అన్ని రకాల సహాయాన్ని అందించాడు. నగరంలో వారి కార్యకలాపాలను నిర్వహించడానికి అతను వారికి ఆదేశాలు ఇచ్చాడు' అని అన్నారు.

మరోవైపు రాష్ట్రంలో ఉగ్రవాదులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉందని ప్రతిపక్ష బీజేపీ ఆరోపించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాకతో ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహించేందుకు 'దేశ వ్యతిరేక శక్తులు' బలపడ్డాయని బీజేపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఆర్.అశోక అన్నారు. ముఠా గుట్టు రట్టు చేసిన సీసీబీని మాజీ ముఖ్యమంత్రి బసవరాజు బొమ్మై అభినందించారు. ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కి అప్పగించాలని డిమాండ్ చేశారు.

చావబాది... నోట్లో మూత్రం పోసి...

- గిరిజన యువకుడిపై అమానుషం
- ఒంగోలులో ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

విశాలాంధ్ర-ఒంగోలు: గిరిజన యువకుడితో కొందరు ఫూటుగా మద్యం తాగించి, విచక్షణారహితంగా చావబాదారు. రక్తమోడుతున్న ఆ గాయాలతో అతను విలవిల్లాడుతున్నా కనికరం చూపకుండా అతని నోట్లో మూత్రం పోసి అమానుషంగా ప్రవర్తించారు. తనను వదిలేయాలంటూ బాధితుడు వేడుకున్నా వినిపించుకోలేదు. అసభ్య పదజాలంతో దూషిస్తూ, ఈ దారుణాన్ని సెల్ ఫోన్‌లో చిత్రీకరించారు. ప్రకాశం జిల్లా కేంద్రం ఒంగోలులో సుమారు నెల క్రితం చోటుచేసుకున్న ఈ అమానవీయ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

మద్యం తాగుదామని పిలిచి...

బాధితుడు మోటా నవీన్ గిరిజన యువకుడు. ప్రధాన నిందితుడు మన్నె రామాంజనేయులు(అంజి). వీరిద్దరూ చిన్నప్పటి నుంచి జులాయిగా తిరుగుతూ నేరాలకు పాల్పడుతున్నారు. అంజి కొన్నేళ్లుగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. కొంతకాలంగా వీరిద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో నెల రోజుల క్రితం అంజి, నవీన్‌ను మద్యం తాగుదామంటూ ఒంగోలులోని కిమ్స్ వైద్యశాల వెనుక వైపునకు పిలిచాడు. నవీన్ అక్కడికి వెళ్లేసరికి అక్కడ అంజితో పాటు ఒంగోలులోని ఇస్లాంపేట, గోపాలనగర్, బాపట్ల జిల్లా వేటపాలేనికి చెందిన మొత్తం 9 మంది యువకులు ఉన్నారు. అందరూ కలిసి మద్యం తాగారు. ఈ క్రమంలో అంజి పాత వివాదాన్ని తిరగదోడటంతో మాటామాటా పెరిగింది. అప్పటికే ఒక పథకం ప్రకారం అక్కడున్న తొమ్మిది మందీ కలిసి నవీన్‌పై మూకుమ్మడిగా దాడి చేశారు. తనను వదిలిపెట్టాలని బాధితుడు కాళ్లావేళ్లా పడ్డా కనికరించలేదు. విచక్షణారహితంగా దాడి చేసి రక్తమోడేలా కొట్టారు. అంతటితో ఆగకుండా అతడి నోట్లో మూత్రం పోస్తూ తాగాలని బలవంతం చేస్తూ మరోసారి దాడి చేశారు. మర్మాంగాన్ని అతని నోట్లోకి చొప్పించే ప్రయత్నం చేశారు. ఈ దారుణాన్నంతా సెల్ ఫోన్‌లో చిత్రీకరించారు. ఇప్పుడు ఆ వీడియోలు వెలుగుచూశాయి.

పోలీసులు కేసు కట్టి... చేతులు దులిపేసుకున్నారు

నెల రోజుల క్రితం జరిగిన ఈ వ్యవహారంపై బాధితుడు ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేవలం దాడి, ఎస్సీ, ఎస్టీ కేసుగా నమోదు చేసి చేతులు దులుపుకొన్నారు. నిందితుల విచారణ, అరెస్టుకు ప్రయత్నించలేదు. తాజాగా నిందితుల్లో కొందరు ఈ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో అది వైరల్‌గా మారి పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో పోలీసులు ఒక్కసారిగా అప్రమత్తమై నిందితుల కోసం వెతుకులాట ప్రారంభించారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉండగా, ఈ ఘటనలో పాలుపంచుకున్న వారిలో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఇది మీ ప్రభుత్వం

- మైనార్టీల మనస్సు నొప్పించే ఏ పని చేయదు
- ఉమ్మడి పౌరస్మృతిపై ముస్లిం పెద్దలతో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: 'ఈ ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాలు, మైనార్టీల ప్రభుత్వం. మీ మనసు నొప్పించేలా ఎప్పుడూ వ్యవహరించదు. మీరు ఎలాంటి ఆందోళనకు, భయాలకు గురికావాల్సిన అవసరం లేద'ని సీఎం జగన్ బుధవారం ముస్లిం పెద్దలకు భరోసా ఇచ్చారు. ఉమ్మడి పౌరస్మృతి అంశంపై ముఖ్యమంత్రిని కలిసిన ముస్లిం ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, ఆ వర్గాల ప్రతినిధులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. జగన్ మాట్లాడుతూ ఉమ్మడి పౌరస్మృతి అంశం మీద ముసాయిదా ఇప్పటివరకూ రాలేదు. అందులో ఏ అంశాలున్నాయో ఎవ్వరికీ తెలియదు. మీడియాలో, బయట చర్చ విపరీతంగా నడుస్తోంది. వాటిని చూసి ముస్లింలు పెద్దస్థాయిలో తమ మనోభావాలను వ్యక్తంచేస్తున్నారు. మీ మనస్సు నొప్పించే పని టెప్పుడు చేయం. భయపడొద్దు' అని ధైర్యం చెప్పారు. 'రాష్ట్రానికి పాలకుడిగా, ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్నా. ఇలాంటి పరిస్థితుల్లో నా స్థానం మీరుంటే ఏం చేసేవారో సలహాలివ్వండి. ముస్లిం ఆడబిడ్డల హక్కుల రక్షణ విషయంలో ముస్లింలే వ్యతిరేకంగా ఉన్నారని దుష్ప్రచారం సాగుతోంది. దీన్ని మత పెద్దలుగా మీరు తిప్పికొట్టాలి. ఒకే కడుపున పుట్టిన బిడ్డల విషయంలో ఏ తండ్రైనా, తల్లి అయినా ఎందుకు భేదభావాలు చూపుతారు? మహిళలకు సమాన హక్కుల విషయంలో ఏ మాత్రం రాజీలేదనే విషయాన్ని మనమంతా స్పష్టం చేద్దాం' అని జగన్ అన్నారు. భారతదేశం చాలా విభిన్నమైనదని, అనేక కులాలు, మతాలు వర్గాలు ఉన్నాయని, ఒకే మతంలోని వివిధ వర్గాలకూ రకరకాల సంప్రదాయాలు, ఆచారాలు ఉన్నాయని చెప్పారు. మత గ్రంథాలు, విశ్వాసాలు, సంప్రదాయాల ఆధారంగా పర్సనల్ లా బోర్డులు ఉన్నాయని, ఏ నియమ- నిబంధనైనా తీసుకురావాలనుకున్నప్పుడు ఆయా మతాలకు చెందిన సంస్థలు, పర్సనల్ లాబోర్డుల ద్వారానే చేయాలి తప్ప ప్రభుత్వాలు నేరుగా తీసుకు రాకూడదు. ఎందుకంటే వాటిమీద పూర్తి అవగాహన మత వ్యవహారాలు చూసే వారికే ఉంటుంది. ఒకవేళ మార్పులు అవసరం అనుకుంటే, ఈ విషయంలో సుప్రీంకోర్టు, లా కమిషన్, కేంద్ర ప్రభుత్వం అందరూ కలిసి, వివిధ మతాలకు చెందిన సంస్థలను, పర్సనల్ లా బోర్డు సభ్యులతో కలిసి లా బోర్డుల ద్వారా అవసరమైన మార్పులు చేయాలి. అందుకు వేరే పద్ధతి అనుసరించడం భిన్నత్వమున్న మన దేశానికి తగదు' అని సీఎం అన్నారు. కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ జకియా ఖానమ్, ఉప ముఖ్యమంత్రి (మైనార్టీ సంక్షేమశాఖ) అంజద్ బాషా, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్, ఎమ్మెల్యేలు అబ్దుల్ హాఫీజ్ ఖాన్, నవాజ్ బాషా, షేక్ ముస్తఫా, ఎమ్మెల్సీలు షేక్ మహమ్మద్ ఇక్బాల్, మహమ్మద్ రుహుల్లా, ఇతర ప్రజా ప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

అండగా ఉంటాం

- మతవిశ్వాసాలకు, సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతిస్తాం
- ముస్లింలకు టీడీపీ అధినేత చంద్రబాబు హామీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ముస్లింల మనోభావాలకు వ్యతిరేకంగా తమ పార్టీ ఎప్పుడూ పనిచేయదని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. ఉమ్మడి పౌరస్మృతిపై ముస్లింల సూచనలపై అధ్యయనం చేస్తామని చెప్పారు. ఆ వర్గానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ముస్లింల సంక్షేమం, అభివృద్ధి, మత విశ్వాసాలకు టీడీపీ ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ముస్లిం మతపెద్దలు, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి నేతలు, నాయకులు బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో చంద్రబాబును కలిశారు. ఉమ్మడి పౌరస్మృతిపై అభ్యంతరాలు, అభిప్రాయాలు వెల్లడించారు. మత స్వేచ్ఛకు అడ్డుపడే ఈ చట్టానికి మద్దతు ఇవ్వవద్దని కోరారు. చంద్రబాబు స్పందిస్తూ ఇస్లామియా నూతన సంవత్సరంలో మొదటి రోజు ముస్లిం సోదరులను కలుసుకోవడం సంతోషంగా ఉందని చెబుతూ వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి పౌరస్మృతి విషయంలో మైనార్టీ వర్గ అభిప్రాయాలను టీడీపీ గౌరవిస్తుందని, అన్ని విధాలా తోడుగా ఉంటుందని అన్నారు. మహిళలకు ఆస్తిలో 1/3 వాటా ఇవ్వాలని పవిత్ర ఖుర్ఆన్ చెబుతుందని చంద్రబాబు గుర్తుచేశారు. టీడీపీ ఆవిర్భావం తరువాత మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పిస్తూ చట్టాన్ని ఎన్టీఆర్ చేశారని, మహిళల హక్కుల విషయంలో టీడీపీ మొదటి నుంచి అండగా ఉందని చెప్పారు. ముస్లింల అభివృద్ధికి చేసిన నిర్ణయాలు, తెచ్చిన పథకాలను ప్రస్తావించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉర్దూను రెండో అధికార భాషగా గుర్తించామని, హజ్ యాత్ర సౌకర్యం కల్పించి, హైదరాబాద్‌లో హజ్ హౌస్ కట్టామని, ఇమామ్‌లు, మౌజన్‌లకు గౌరవ వేతనం ఇచ్చామని చెప్పారు. దుఖాన్- మకాన్, రంజాన్ తోఫా, విదేశీ విద్య వంటి సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. అబ్దుల్ కలామ్‌ను రాష్ట్రపతి చేశామన్నారు. ప్రత్యేకంగా ముస్లింలకు మెడికల్, ఇంజనీరింగ్ కాలేజీలు ఇచ్చిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదేనన్నారు. సమావేశంలో అహ్లే సున్నత్ జమాత్, జమాతే ఉలేమా యే హింద్, జమాతే ఇస్లామీ హింద్, అహ్లే హదీస్ సంస్థల ప్రతినిధులు, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు ఫారూఖ్ షుబ్లీ, టీడీపీ మాజీ మంత్రి ఫరూక్, శాసనమండలి మాజీ చైర్మన్ అహ్మద్ షరీఫ్, మాజీ ఎమ్మెల్యేలు జలీల్ ఖాన్, అక్తర్ చాంద్ బాషా, షాజహాన్ బాషా, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి నసీర్ అహ్మద్, రాష్ట్ర అధికార ప్రతినిధి మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

'ఇండియా'కు మద్దతు తెలపండి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

విశాలాంధ్ర- రాజమండ్రి: కులం, మతం, ప్రాంతీయ వాదాలతో దేశ ప్రజలను విభజిస్తున్న బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి గద్దెదించడమే లక్ష్యంగా ఏర్పడిన విపక్షాల కూటమి 'ఇండియా'కు ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పిలుపు నిచ్చారు. బుధవారం ఉదయం స్థానిక సీపీఐ కార్యాలయంలో జిల్లా స్థాయిలోని పార్టీ శాఖా కార్యదర్శుల రెండు రోజుల వర్క్ షాప్‌ను ఆమె ప్రారంభించారు. ప్రారంభ సభకు సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అధ్యక్షత వహించారు. అక్కినేని వనజ మాట్లాడుతూ దేశంలో ప్రజా స్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు 28 రాజకీయ పార్టీలు ఏకమై ఇండియన్ నేషనల్ డెవలప్మెంటల్ ఇంక్లూజివ్ అలయన్స్ (ఇండియా)గా ఏర్పడ్డాయని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విదేశీ పర్యటన మోజు తప్ప హింసతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలన్న ధ్యాస లేదన్నారు. కనీసం ఆ రాష్ట్ర పరిస్థితిపై చర్చించడానికి కూడా ఆయన సిద్ధంగా లేరని విమర్శించారు. ఏపీకి తీవ్ర అన్యాయం చేసిన మోదీ వైపు ఉంటారో? దేశ ప్రజల క్షేమం కోసం పోరాడుతున్న ప్రతిపక్ష కూటమి వైపు ఉండాలో రాష్ట్రంలోని రాజకీయపార్టీలు ఆలోచించాలన్నారు. ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు, కడప ఉక్కు, పోలవరం ప్రాజెక్టు తదితర సమస్యలపై పోరాడుతున్న వామపక్ష పార్టీలకు ప్రజలు మద్దతు పలకాలని ఆమె కోరారు. అనంతరం మార్క్సిస్ట్ తత్వశాస్త్రం అనే అంశంపై ప్రముఖ రాజకీయవేత్త డీవీఎస్ వర్మ బోధించారు. ఈ వర్క్ షాప్ కు ప్రిన్సిపాల్‌గా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కోండ్రపు రాంబాబు వ్యవహరించారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి రేఖ భాస్కరరావు, నగర కార్యదర్శి వి.కొండలరావు, జట్ల సంఘం ప్రధాన కార్యదర్శి సప్ప రమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కే జ్యోతి రాజు, చింతలపూడి సునీల్, సేపెని రమణమ్మ, ప్రజానాట్యమండలి ఉమా, నిడదవోలు ఎం ప్రసాద్, పెరవలి నాగేశ్వరరావు, నల్లజర్ల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

మసక బారుతున్న బ్యాంకుల జాతీయీకరణ లక్ష్యం

కిషోర్ కుమార్

విశాలాంధ్ర-విజయవాడ: దేశ సర్వతోముఖాభివృద్ధిని కాంక్షిస్తూ నాడు తీసుకున్న బ్యాంకుల జాతీయీకరణ లక్ష్యం మసకబారుతుందని అఖిల భారత బ్యాంకు అధికారుల సమాఖ్య ఆందోళన వ్యక్తం చేసింది. 55వ బ్యాంకుల జాతీయీకరణ దినోత్సవం సందర్భంగా అఖిల భారత బ్యాంకు అధికారుల సమాఖ్య నేతృత్వంలో నగరంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పరిపాలనా కార్యాలయం వద్ద బుధవారం ప్రదర్శన నిర్వహిం చారు. ఈ సందర్భంగా సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి కిషోర్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి వైవి సత్యన్నారాయణ మాట్లాడుతూ దేశ నిర్మాణ ప్రక్రియలో అవిశ్రాంతంగా పనిచేస్తున్న బ్యాంకు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన అత్యావశ్యకమ న్నారు. సామాజిక లక్ష్యాలను అనుసరించి ప్రభుత్వ రంగ బ్యాంకులు వివిధ కొలమానాలలో ప్రైవేట్ రంగ బ్యాంకులను మించి పని చేస్తున్నాయన్నారు. జన్‌ధన్ ఖాతాల పరంగా 16.5 బిలియన్ల ఖాతాలను ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రారంభించగా, ప్రైవేట్ రంగ బ్యాంకులు కేవలం 68 మిలియన్ జన్‌ధన్ ఖాతాలను మాత్రమే తెరిచాయన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉద్యోగులు జాతీయ విలువలను కాపాడటంతో పాటు అత్యంత నిబద్ధతతో పౌరులకు సేవ చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. జాతీయీకరణపై అవగాహన కల్పించే క్రమంలో దేశవ్యాప్తంగా వారం రోజుల పాటు ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. రక్తదాన శిబిరాలు, ఆరోగ్య పరీక్షా శిబిరాలు, చెట్ల పెంపకం, పాఠశాల, కళాశాలల్లో జాతీయీకరణపై చర్చలు, సమాజ అభివృద్ధికి కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు వీఆర్‌కే.మోహన్, శ్రీనివాసరావు, నారయ్య, గౌస్, మూర్తి, యోబు, నటరాజ్, రామిరెడ్డి, మురళీ కృష్ణ, సూర్య ప్రకాష్, అజీమ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

గుంటూరులో ఏసీబీ దాడులు

భారీగా పట్టుబడిన అక్రమాస్తులు

విశాలాంధ్ర-విజయవాడ: ఏసీబీ అధికారులు బుధవారం గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ సంయుక్త కార్యదర్శి కేడీవీఎం ప్రసాద బాబు ఇల్లు, ఆస్తులను తనిఖీ చేశారు. కోట్లాది రూపాయల అక్రమ ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. ఏలూరులో రెండు, విజయవాడ పోరంకిలో రెండు ప్లాట్లు, మాదేపల్లిలో ఆర్‌సీసీ ఇల్లు, భవనం, హైదరాబాద్‌లోని బూదన్ పోచంపల్లి వద్ద జీ+2 భవనం, పామర్రులో ఖాళీ స్థలం, దెందులూరులో 90 సెంట్ల వ్యవసాయ భూమితో పాటు స్కోడా ర్యాపిడ్ బీఎస్-6, మారుతి ఎర్టిగా ఎస్‌హెచ్‌వీఎస్ జడ్‌డీఐ+ బీఎస్ఐవీ, ఇన్నోవా సదన్ కార్లు, బుల్లెట్ క్లాసిక్, యాక్టివా ఎలక్ట్రిక్ సీబీఎస్ బీఎస్3, యాక్టీవా 5జీ ద్విచక్ర వాహనాలు, 500 గ్రాముల స్వర్ణాభరణాలు, రూ.30 వేల నగదుతో పాటు రూ.15లక్షల విలువైన ఎల్ఐసీ పాలసీలు, మౌనిక ఆక్వా ఫామ్‌లో రూ.1,00,00,000 పెట్టుబడి, మౌనిక ఆక్వా ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో రూ.30,00,000, ఇతర వ్యక్తులకు ఇచ్చిన రూ. 26,00,000 విలువ చేసే మూడు ప్రామిసరీ నోట్లును అధికారులు గుర్తించారు. ప్రసాదబాబు 1991లో హైదరాబాద్‌లో ఐటీబీపీ కానిస్టేబుల్ స్థాయి నుంచి ఎస్‌పీఎఫ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా, ఎస్ఐ, సీఐగా ఎదిగారు. 2007లో గ్రూప్-1 అధికారయ్యారు. ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ శాఖ ఏటీఓగా నియమితులయ్యారు. ఆపై భువనగిరి జిల్లా ఏటీఓగా, ట్రెజరీ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు.

ఏపీ హక్కుల సాధన కోసం రాష్ట్ర ఎంపీలు కేంద్రాన్ని నిలదీయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్): రాష్ట్ర విభజన సందర్భంగా కేంద్రం ఇచ్చిన హామీలు, హక్కుల సాధన కోసం వైసీపీ, టీడీపీ ఎంపీలు కేంద్రాన్ని నిలదీయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని ఆటంకపరుస్తూ, విభజన హామీలు అమలు చేయకుండా ప్రజల మధ్య, పార్టీల మధ్య చీలికలు తెచ్చి దేశాన్ని బలహీన పరుస్తుంటే, కేంద్రాన్ని నిలదీయకుండా లౌకిక వాదాన్ని ఎలా పరిరక్షిస్తారో ప్రశ్నించుకోవాలని ఆయన అధికార వైసీపీ, టీడీపీ, జనసేనకు హితవు పలికారు. స్థానిక ఎంబీ విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ జులై 20 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంటు సమావేశాల్లో ఏపీకి ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు పరిరక్షణ, పోలవరం నిర్వాసితుల సమస్యపై కేంద్రాన్ని నిలదీసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని వైసీపీ, టీడీపీ ఎంపీలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం ఇప్పటికే తీవ్రంగా నష్టపోయిందని, ప్రాజెక్టులు పూర్తికాలేదని, ఉపాధి, ఉద్యోగాలు లేక, ఆఖరికి ఉద్యోగులు జీతభత్యాల కోసం అడుక్కోవలసిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రజా సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి, కేంద్రంతో పోరాడి నిధులు తెచ్చుకోవాల్సింది పోయి రుణం కోసం వారు పెట్టిన షరతులకు తలవంచి ప్రజలపై భారాలు మోపటం దుర్మార్గమన్నారు. ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) పార్లమెంటులో వ్యతిరేకించి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. మోదీకి పెద్ద సవాలుగా 'ఇండియా' పేరుతో ఏర్పడిన కూటమిని సీపీఎం ఆహ్వానిస్తోందన్నారు. ఈ కూటమి ఏర్పాటు సన్నాహాలు గమనించిన మోదీ బెంబేలెత్తిపోయి హంగామాతో ఏర్పాటు చేసిన ఎన్‌డీఏ సమావేశంలో 38 పార్టీలలో 24 పార్టీలకు పార్లమెంటు సభ్యులు లేక ప్రాధాన్యత లేదని శ్రీనివాసరావు తెలిపారు. జనసేన ఎన్‌డీఏ సమావేశానికి వెళ్లటం రాష్ట్రానికి చేటు చేస్తుందని, కేంద్ర ప్రభుత్వ విద్రోహానికి వ్యతిరేకంగా పోరాడతానని రంకెలు వేసిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఏరకంగా ఎన్‌డీఏ గూటికి చేరాడని ప్రశ్నించారు. టీడీపీతో అవగాహనకు వస్తామని బీజేపీ ప్రకటించిందని, దీనిపై టీడీపీ నోరు మెదపటం లేదన్నారు. బీజేపీ మతోన్మాదానికి వ్యతిరేకంగా గళం విప్పాలని మేధావులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సీహెచ్ బాబూరావు పాల్గొన్నారు.

ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలి

అఖిలపక్షంలో ఎంపీ విజయసాయిరెడ్డి డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-ఢిల్లీ/అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడంతో పాటు విభజన హామీలను తక్షణమే అమలు చేయాలని కేంద్రప్రభుత్వాన్ని వైసీపీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి కోరారు. పోలవరం నిధులు, రైల్వేజోన్, విశాఖ స్టీల్ ప్రైవేటీకరణకు వ్యతిరేక తదితర అంశాలను బుధవారం ఢిల్లీలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో ప్రస్తావించారు. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతూ విశాఖ రైల్వేజోన్ ఏర్పాటు చేసి నాలుగేళ్లవుతున్నప్పటికీ ఇంతవరకు అమలు చేయలేదని కేంద్రానికి గుర్తుచేసినట్లు తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వైసీపీ వ్యతిరేకించిందని, స్టీల్ ప్లాంట్ నష్టాల్లో లేదనే విషయాన్ని గమనించి ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండు చేశామన్నారు. చట్టసభల్లో మహిళాలకు రిజర్వేషన్ కల్పించాలని కోరామన్నారు. ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ)పై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, అది వచ్చాక తమ విధానాన్ని ప్రకటిస్తామని ఓ ప్రశ్నకు బదులిచ్చారు.

ముందుగా ఏపీసెట్ నిర్వహించాలి

ఏపీ నిరుద్యోగ జేఏసీ వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశ్వవిద్యాలయాల్లో రెండు వేల సహాయ బోధనా సిబ్బంది పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు ఏపీ నిరుద్యోగ జేఏసీ ప్రకటించింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. సహాయ బోధనా సిబ్బంది పోస్టుల భర్తీ కంటే ముందు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్(ఏపీసెట్) నిర్వహించాలని జేఏసీ అధ్యక్షులు సమయం హేమంత్ కుమార్ కోరారు. ఆయా ఉద్యోగాల భర్తీలో ఏపీసెట్‌గానీ, నెట్‌గానీ చేసిన వారికి అదనపు మార్కులు లభిస్తాయని ప్రభుత్వం పేర్కొనడాన్ని ప్రస్తావించారు. ఏటా ఏపీసెట్ నిర్వహించాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను కోరారు.

డయాఫ్రమ్ వాల్‌కు నష్టం

గత ప్రభుత్వ తప్పిదమే

జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు

విశాలాంధ్ర-ఏలూరు: పోలవరం ప్రాజెక్టు పనులను గత ప్రభుత్వం ప్రోటోకాల్‌కు భిన్నంగా చేపట్టిన కారణంగా దయాఫ్రమ్ వాల్‌కు నష్టం జరిగిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పోలవరం ప్రాజెక్టు పనులను బుధవారం పరిశీలించిన అనంతరం ప్రాజెక్టు హాలులో విలేకరు లతో మంత్రి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నిర్మించవలసిన జాతీయ ప్రాజెక్టును తాము నిర్మిస్తామని చంద్రబాబు ప్రభుత్వం నెత్తినేసుకోవడమే గత ప్రభుత్వం చేసిన మొదటి తప్పిదమన్నారు. గోదావరి నది నీటిని మళ్లించేందుకు ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్ పూర్తి చేసిన తరువాత దయాఫ్రమ్ వాల్ నిర్మించాల్సి ఉండగా, వాటిని పూర్తి చేయకుండా దయాఫ్రమ్ వాల్ నిర్మించి రెండవ తప్పిదం చేశారని తెలిపారు. కాఫర్ డ్యామ్‌కు మూడేళ్ల వరకు గ్యారెంటీ ఉంటుందని, ఆ సమయంలోనే ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ నిర్మించుకోవలసి ఉంటుందని, అలా కాకుండా నది నీటిని మళ్లించే పని చేయకుండా లోయర్, అప్పర్ కాఫర్ డ్యామ్ పనులను గత ప్రభుత్వం చేపట్టిందన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత లోయర్, అప్పర్ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేశామని అంబటి తెలిపారు. గత ప్రభుత్వం ఎగువ కాఫర్ డ్యామ్‌ను 2018లో, దిగువ కాఫర్ డ్యామ్‌ను 2015లో ప్రారంభించిందని అన్నారు. కానీ గత ప్రభుత్వం ప్రోటోకాల్‌కు భిన్నంగా దయాఫ్రమ్ వాల్ ముందుగా నిర్మించి, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు తరువాత నిర్మించి చారిత్రాత్మక తప్పిదం చేసిన కారణంగా గత సంవత్సరం గోదావరి నదికి వచ్చిన వరద ఉధృతికి డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్నదన్నారు. ఆ తప్పిదాన్ని తమ ప్రభుత్వం సరి చేసిందని తెలిపారు. కాఫర్ డ్యామ్, స్పిల్ వే, స్పిల్ ఛానల్, పైలట్ ఛానల్, అప్రోచ్ ఛానల్‌ను తమ ప్రభుత్వం పూర్తి చేసిందని, స్పిల్ వే కి గేట్లు ఏర్పాటు చేసి నది నీటిని మళ్లించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. కేంద్ర జల సంఘం, నేషనల్ హైడ్రో ప్రాజెక్టు కార్పొరేషన్ నిపుణులు డయాఫ్రమ్ వాల్‌ని పరిశీలించిన తరువాత వారి సూచనల మేరకు డయాఫ్రమ్ వాల్‌కి మరమ్మతులు లేక దానిక తీఇసమాంతరంగా మరో డయాఫ్రమ్ వాల్ నిర్మించడమా అన్నది నిర్ణయిస్తామన్నారు. పోలవరం ప్రాజెక్టు దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి కల అని, గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను అధిగమించి ప్రాజెక్టు నిర్మాణంలో ముందుకు వెళతామన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో తమ ప్రభుత్వం చిత్తశుద్ధి, పారదర్శకతతో ఉందని మంత్రి అంబటి తెలిపారు. గోదావరి నదికి గత సంవత్సరం వచ్చిన అధిక వరదల కారణంగా అత్యవసర పరిస్థితులలో ఎగువ కాఫర్ డ్యామ్ ఎత్తును ఒకటిన్నర మీటర్లు పెంచామన్నారు. ప్రస్తుతం గోదావరి నదికి 1.2 లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తున్నదని, వరద నీటి కారణంగా ప్రాజెక్టు పనులకు ఎటువంటి అంతరాయం లేదని, వరద తీవ్రత ఇంకా పెరిగితే అప్పటి పరిస్థితిని అనుసరించి చర్యలు తీసుకుంటా మన్నారు. ఈ సమావేశంలో జలవనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ నారాయణ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ సుధాకర్ బాబు, సూపరింటెండింగ్ ఇంజనీర్ నరసింహ మూర్తి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఉదయం పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్, దయాఫ్రమ్ వాల్, స్పిల్ వేను మంత్రి అధికారులతో కలిసి పరిశీలించారు.

సంపాదకీయం

తీస్తా సెతల్వాడ్‌కు ఊరట

గుజరాత్ మారణకాండకు సంబంధించిన కేసులో ప్రసిద్ధ న్యాయవాది, మానవహక్కుల కార్యకర్త తీస్తా సెతల్వాడ్‌కు సుప్రీం కోర్టు బుధవారం ఊరట కలిగించింది. అంతకుముందు ఇదే నెలలో తక్షణం లొంగిపొమ్మని గుజరాత్ హైకోర్టు ఆమెను ఆదేశించింది. తీస్తా సెతల్వాడ్ గుజరాత్ మారణకాండకు సంబంధించి కట్టు కథలల్లి కేసులు నమోదు చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. గుజరాత్‌లోని కింది కోర్టుల నుంచి హైకోర్టు దాకా అన్ని కోర్టులూ బీజేపీకి అనుకూలంగా తీర్పులు ఇవ్వడం స్పష్టంగా కనిపిస్తోంది. 2002లో గుజరాత్ మారణకాండ జరిగితే ఆమె మీద 2022లోనే కేసులు ఎందుకు నమోదు చేశారని, ఇరవై ఏళ్లుగా ఏం చేస్తున్నారని ప్రశ్నించిన సుప్రీంకోర్టు...ఈ కేసే అనుమానాస్పదంగా ఉందని వ్యాఖ్యానించింది. న్యాయమూర్తులు బి.ఆర్.గవాయ్, ఎ.ఎస్.బొపన్న, దీపంకర్ దత్తాతో కూడిన బెంచి ఈ వ్యాఖ్యలు చేసింది. చార్జ్ షీట్ దాఖలైంది కనక ఆమెను నిర్బంధంలోకి తీసుకుని విచారించవలసిన అగత్యం ఏముందని న్యాయమూర్తులు ప్రశ్నించారు. సెతల్వాడ్‌ను అరెస్టు చేయడానికి ఎంచుకున్న సమయాన్ని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నార్థకం చేసింది. అధికారులు వ్యవహరిస్తున్న తీరునుబట్టి చూస్తే సాక్ష్యాధారాల చట్టాన్నే చెత్తబుట్టలో వేయవలసి వస్తుందని న్యాయమూర్తి గవాయ్ తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. ఎవరి మీదైనా కేసు మోపితే వారి మీద తీర్పు వచ్చే దాకా జైలులో ఉంచాలని అధికారులు భావిస్తున్నట్టు కనిపిస్తోందని గవాయ్ అన్నారు. మోదీ ప్రతిష్ఠను దెబ్బ తీయడానికే సెతల్వాడ్ కూడా సాక్ష్యాలు చూపుతున్నారన్న ఆరోపణలను సుప్రీంకోర్టు అనుమాన దృష్టితోనే చూస్తున్నట్టు తేలిపోతోంది. గుజరాత్ మారణకాండ సమయంలో మాజీ ఎంపీ ఎహ్సాన్ జాఫ్రీని హతమార్చారు. తన భర్తను హతమార్చినందుకు జకియా జాఫ్రీ చేస్తున్న న్యాయ పోరాటానికి తీస్తా సెతల్వాడ్ అండగా నిలబడడం గుజరాత్ ప్రభుత్వానికి మింగుడు పడడం లేదు. బెయిల్ కోసం సెతల్వాడ్, జకియా జాఫ్రీ పెట్టుకున్న అర్జీని కోర్టు తిరస్కరించిన రెండు రోజులకే సెతల్వాడ్‌ను అరెస్టు చేయడం చూస్తే గుజరాత్ ప్రభుత్వ అధికారులు కత్తిగట్టినట్టు ప్రవర్తిస్తున్నారని భావించక తప్పదు. మారణకాండకు అప్పటి ముఖ్యమంత్రి మోదీ ప్రోత్సాహం ఉందన్న ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. గత ఏడాది సుప్రీంకోర్టు తాత్కాలిక బెయిలు మంజూరు చేసిన తరవాత సెతల్వాడ్ జైలు నుంచి విడుదలయ్యారు. ఆ తరవాత ఆమె శాశ్వత బెయిలు కోసం ప్రయత్నం చేస్తున్నారు. మారణకాండ సమయంలో గుజరాత్ పాలనా వ్యవస్థ పని తీరును సెతల్వాడ్ నిరంతరం తప్పు పడ్తూనే ఉండడం గుజరాత్ పాలనా యంత్రాంగానికి ఇప్పటికీ జీర్ణం కావడం లేదు.

గత జూన్‌లో సెతల్వాడ్‌కు బెయిలు ఇవ్వడాన్ని గుజరాత్ ప్రభుత్వం వ్యతిరేకించింది. ఆమె కొన్ని రాజకీయ పక్షాల చేతిలో కీలుబొమ్మగా ఉన్నారని వ్యాఖ్యానించి హైకోర్టు తన రాజకీయ పక్షపాతాన్ని రుజువు చేసుకుంది. గుజరాత్‌లో ముస్లింల మీద కొనసాగిన మారణకాండను సవాలు చేస్తూ, దీనిలో అప్పటి ముఖ్యమంత్రి ప్రోత్సాహం ఉందని ఆరోపిస్తూ జకియా జాఫ్రీ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంలో సెతల్వాడ్ కూడా భాగస్వామే. ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని గత ఏడాది సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. దానితో పాటు న్యాయ ప్రక్రియను దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించింది. ఆ వెంటనే సెతల్వాడ్‌ను అరెస్టు చేసిన తరువాత రెండు నెలలు జైలులో గడిపిన ఆమెకు తాత్కాలిక బెయిలు మంజూరు అయింది. అనంతరం ఆమె మామూలు బెయిలు కోసం చేసిన అన్ని ప్రయత్నాలకు హైకోర్టులో చుక్కెదురైంది. హైకోర్టు నిరాకరించిన తరవాత సెతల్వాడ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సెతల్వాడ్ లాంటివారు ఎవరి చేతిలోనో కీలుబొమ్మలుగా ఉన్నారని ప్రచారం చేయడం కొత్త కాదు. గుజరాత్ మారణకాండను కావాలని కొండంతలు చేసి చూపిస్తున్నారని, అందులో సెతల్వాడ్ లాంటి వారు కీలక పాత్ర పోషిస్తున్నారన్న ఆరోపణలూ చాలా కాలం నుంచే ఉన్నాయి. 2002 నాటి మారణకాండను ఏదో చిన్న సంఘటనగా చిత్రించాలని బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను ఇప్పుడు కోర్టులను కూడా నమ్మించడానికి తీవ్ర ప్రయత్నం జరుగుతోంది. జకియా జాఫ్రీలాంటి వారికి సెతల్వాడ్ అండగా నిలబడి ఉండొచ్చు. కానీ ఆమె ఈ విషయంలో కోర్టుకు ఎక్కకముందే జాతీయ మానవ హక్కుల కమిషన్, ఎన్నికల కమిషన్ మారణకాండలో లోపాయికారీ వ్యవహారాలను ఎండగట్టాయి. అందువల్ల మోదీ ప్రతిష్ఠను దెబ్బ తీయడానికి సెతల్వాడ్ మాత్రమే కంకణం కట్టుకున్నారని వాదించడం అర్థ రహితం. మోదీ ప్రతిష్ఠను సెతల్వాడ్ దెబ్బ తీస్తున్నారని వాదించడం వెనక ఆంతర్యం బ్రహ్మ రహస్యమేమీ కాదు. గుజరాత్ మారణకాండను అప్పటి జాతీయ మానవ హక్కుల కమిషన్ అధ్యక్షులు జె.ఎస్.వర్మ, న్యాయమూర్తులు కె.రామస్వామి, సుజాతా మనోహర్, వీరేంద్ర దయాళ్ పరిగణనలోకి తీసుకున్నారు. అక్కడితో ఆగకుండా సమగ్రమైన నివేదిక ఇవ్వాలని మోదీ ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈ న్యాయమూర్తులు గుజరాత్‌లో పర్యటించారు కూడా. అప్పుడు మానవ హక్కుల కమిషన్‌కు అధ్యక్షులుగా ఉన్న జె.ఎస్.వర్మ అంతకుముందు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి. ఈ మారణకాండలో మరణించిన వారి కుటుంబాలకు పరిహారం అందించడంలోనూ గుజరాత్ ప్రభుత్వం పక్షపాత దృష్టి స్పష్టంగా కనిపిస్తోందని అప్పటి నివేదికలో పేర్కొన్నారు. బాధితులకు పరిహారం అందించడంలోనూ అప్పటి మోదీ సర్కారు పక్షపాతంతోనే వ్యవహరించింది. మారణకాండ తరువాత గుజరాత్‌లో ఎన్నికలు నిర్వహించడానికి అనువైన పరిస్థితులు ఉన్నాయో లేదో అంచనా వేయడానికి ఎన్నికల కమిషన్ ఆ రాష్ట్రంలో పర్యటించింది. ప్రభుత్వం పంపిన నివేదికలకు, మోదీ ప్రభుత్వం నడవడికకు పొంతన లేదని ఎన్నికల కమిషన్ తేల్చింది. బెస్ట్ బేకరీ కేసును మళ్లీ విచారించాలని పెట్టుకున్న అర్జీని పరిశీలించిన సమయంలో అప్పటి ప్రధాన న్యాయమూర్తి వి.ఎన్.ఖరే సైతం గుజరాత్ ప్రభుత్వం అధీనంలో జరిగే ప్రాసిక్యూషన్ ప్రక్రియ నమ్మశక్యంగా లేదని వ్యాఖ్యానించారు. బెస్ట్ బేకరీ ఘటనలో బాలలు, నిస్సహాయులైన మహిళలు మంటలకు ఆహుతి అవుతుంటే 'ఆధునిక నీరోలు' మరెటో చూస్తూ కూర్చున్నారని ఖరే దుయ్యబట్టారు. మానవ హక్కుల సంఘం, ఎన్నికల కమిషన్, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కూడా మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం మీద ప్రతికూల వ్యాఖ్యలు చేయడానికి తోడు మహిళా సాధికారిత కోసం ఏర్పడిన పార్లమెంటరీ కమిటీ కూడా మోదీ ప్రభుత్వ ధోరణిని నిలదీసింది. ఇన్ని వ్యవస్థలు మోదీని బోనులో నెలబెట్టినప్పుడు ఆయన ప్రతిష్ఠను సెతల్వాడ్ దెబ్బ తీస్తున్నారని ఇరవై ఏళ్ల తరువాత ప్రచారం చేయడం వితండవాదమే.

మోదీ పాలనలో బహుజనుల అధోగతి

డా.ముచ్చుకోట సురేష్‌బాబు

భారతదేశ ప్రజలు బలహీన వర్గాల ప్రతినిధిగా మోదీ ప్రజలను ఆదుకుంటాడని ఆశించారు. యువతరంలో ఆశని రేకెత్తించే అనర్గళ మైన ఉపన్యాసాలు, వాగ్దానాలు నీటిమూటలు ఆకట్టుకున్న మోదీ ప్రజలఓట్లను కొల్లగొట్టారుకానీ ఆచరణలో ఆయా వర్గాల ఆకాంక్షలను నెరవేర్చేందుకు అర క్షణమైనా ఆలోచించిన దాఖలాలులేవు. పర్యవసానంగా దేశం అల్లకల్లోలంగా మారింది. తొమ్మిదేళ్ల కాలంలో సమాజంలో అట్టడుగున ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి కానీ, వారి సంక్షేమం, విద్యపై దృష్టి కానీ మోదీ ప్రభుత్వం ఎజెండాలో లేదు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల ఉనికినే ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు కలిస్తే ఈ దేశ జనాభాలో దాదాపు ఎనభై ఐదుశాతం. రాజ్యాంగబద్ధంగా ఈ వర్గాలకు కల్పించిన హక్కులు, రాయితీలను నిర్లక్ష్యం చేసిన ఏ పాలకులూ సుదీర్ఘకాలం కొనసాగలేకపోయారు. ఈ వర్గాలకు ఈ తొమ్మిదేళ్లు జరిగిన నష్టం గతంలో ఎప్పుడూ జరగలేదన్నది స్పష్టం. అయితే మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం ఎకనామిక్ రివ్యూ నుంచి ఈ సామాజిక వర్గాలకు సంబంధించిన అంశాలను తొలగించింది. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన ఉనికిని కూడా ప్రభుత్వం గుర్తించేందుకు సిద్ధంగా లేదని దీనర్థం. అయితే ఈ వర్గాల పట్ల వివక్ష ఆచరణలో కూడా కనిపిస్తున్నది. కేంద్ర బడ్జెట్‌లలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కోసం నిధుల కేటాయింపులు గణనీయంగా తగ్గాయి. ఈ కేటాయింపుల్లో అంకెల్లోనే కోట్లరూపాయలు ఉంటాయి. ఆచరణలో అవి ఏమాత్రం ప్రయోజనాన్ని చేకూర్చలేవు. అందుకుగాను ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను సమర్థంగా అమలు చేయడానికి చట్టబద్ధత కావాలని డిమాండ్ దేశవ్యాప్తంగా వినిపిస్తున్నది. వీటినే మాత్రం పట్టించుకోని ప్రభుత్వం 'నీతి ఆయోగ్' రూపంలో ఊహించని దాడికి పాల్పడుతోంది. గతంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల వినియోగాన్ని, అమలు చేసే పథకాలు 'ప్రణాళికా సంఘం' పర్యవేక్షించేది. అయితే, కేంద్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల పట్ల చూపుతున్న వివక్షను గమనించిన నీతి ఆయోగ్.. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలును పర్యవేక్షించే బాధ్యతను తాము తీసుకోవడం లేదని ప్రకటించింది. దీనితో ఎస్సీ, ఎస్టీల ఆర్థికాభివృద్ధి పట్ల మోదీ ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యం పరాకాష్టకు చేరింది. ఒకవైపు దళితులను, ఆదివాసీలను వివక్షకు, నిర్లక్ష్యానికి గురిచేస్తూ, మరోవైపు తెగల మధ్య తగువులుపెట్టి రావణకాష్టం చేస్తున్నారు. ఈ తొమ్మిదేళ్ళలో ఒక్క టంటే, ఒక్కటికూడా పనికివచ్చే పథకం లేదు. కనీసం ఈ తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగానైనా గత పాలనను సమీక్షించుకుని, దళితులు, ఆదివాసీల పట్ల తమ వివక్షాపూరితమైన వైఖరిని పునఃసమీక్షించుకోకపోతే మోదీ ప్రభుత్వానికి తిప్పలు తప్పవు. రూపాయి ఖర్చు లేకుండా కుల గణన చేసే అవకాశం ఉన్నా ఎందుకు చేయడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలి. బీసీ జనాభా లెక్కలు బయటకొస్తేనే దోపిడీ చేసేవారికి అడ్డుకట్ట పడుతుంది. అందుకే లెక్కలు బయటకు రాకుండా ఆ వర్గాలను అణచివేసే ప్రయత్నం చేస్తున్నారు. 'అందరూ సమష్టిగా కేంద్రం మెడలు వంచాలి. మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించాలి. బీసీల పోరాటానికి జాతీయస్థాయిలో అన్ని రాజకీయపార్టీలు అండగా నిలవాలి. దేశంలో ఓబీసీల్లో 983 కులాలకు ఐదేండ్లుగా ప్రభుత్వ పరంగా ఎలాంటి ప్రయోజనాలు అందట్లేదు. చేతగానిపాలన సాగుతుంది, వ్యవస్థలన్నీ పతనమై పోయాయి, నిరుద్యోగం 8.4 శాతం పెరిగింది. ప్రభుత్వ రంగ సంస్థలు దివాళా తీసేలా చేస్తున్నారు.

ఇన్సూరెన్స్, రైల్వే, కమ్యూనికేషన్, చివరికి ఇస్రో, హెచ్‌ఏఎల్ ప్రైవేటు పరం చేస్తున్నారు. ఆయన ఏదో చేస్తున్నారన్న భ్రమ నుంచి ప్రజలు బయటపడాలి. బీసీల్లోని అన్ని కులాలు ఏకతాటిపైకి వచ్చి రాజకీయంగా బలపడాలి. దేశ జనాభాలో 54% బీసీలే ఉన్నప్పటికీ రాజకీయాల్లో మాత్రం రిజర్వేషన్లు ఇవ్వకపోవడం బాధాకరం. కులాల లెక్కలు తీయకపోతే బీజేపీ గద్దె దిగిపోవాల్సిందే. ఇప్పటివరకు వారి వాటాతో పాటు బీసీలకు వచ్చే వాటా కూడా అనుభవిస్తున్నారు. కులం పేరుతో వివక్షకు గురైన వర్గాల వారికి సమ ప్రాతినిధ్యం దక్కించడం కోసమే రిజర్వేషన్ల వ్యవస్థ" అని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(4) 16(4) లో స్పష్టంగా పేర్కొన్నారు. ఆర్థిక ప్రాతిపదికన ఇవ్వాల్సినవి సంక్షేమ పథకాలు మాత్రమేనని, ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లు ఈబీసీ వర్గాలకు ఎక్కడ నుండి వచ్చింది. రిజర్వేషన్‌కు ప్రాతిపదిక కులం (సామాజిక వెనుకబాటు) మాత్రమే, కేంద్రంలో బీజేపీ ఉన్నప్పటి నుంచి అంతా తారుమారు అవుతుంది. మండల్ కమిషన్ రిపోర్ట్ ప్రకారం ఓబీసీల జనాభా 54శాతం , అగ్రకులాల జనాభా ఎంత అనేది తెలియకుండా వారికి 10 శాతం రిజర్వేషన్లా? అసలు ఏ లెక్కల ప్రకారం 10శాతం కేటాయించారు అనే దానిపై చర్చ జరిగినట్లు లేదు. తీర్పు వెలువరించే ముందు ఓసిల జనాభాను సుప్రీం వద్ద శాస్త్రీయ లెక్కలు లేవు, పరిగణనలోకి తీసుకున్నట్లు లేదు. రిజర్వేషన్లు 50శాతం దాటొచ్చు అన్న సుప్రీం తీర్పు వెనుకబడిన తరగతులు అనుకూలంగా మలచుకుని జనాభా దామాషా ప్రకారం బీసీలకు 54శాతం రిజర్వేషన్ల కోసం పోరాడాలి. సమగ్రంగా, శాస్త్రీయంగా అన్ని కులాల లెక్కలు తీయాలి, వేరే అంశాలు పక్కన పెట్టి జనాభా దామాషా ప్రకారం ప్రాతినిధ్యం కల్పించాలి. మండల్ మహనీయుడు మనకు మార్గదర్శి, ఇదే అంశంపై దేశవ్యాప్త చర్చ జరగాలి. రిజర్వేషన్లు 50శాతం దాటొచ్చు అన్న సుప్రీం తీర్పు ప్రకారం బీసీలకు 54శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి లేదా సమగ్రమైన, శాస్త్రీయమైన కులగణన ద్వారా జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించాలి.

ప్రజాసైన్స్ వేదిక అధ్యక్షులు

ఎన్‌డీఏ వర్సెస్ ఇండియా

మక్కెన సుబ్బారావు

2024 సార్వత్రిక ఎన్నికల సమరానికి జాతీయస్థాయిలో రెండుకూటములు సై అంటున్నాయి 26 ప్రతిపక్ష పార్టీల సమావేశానికి బెంగళూరు వేదికగా, 38 పార్టీల ఎన్‌డీఏకు ఢిల్లీలో బీజేపీ ఆతిధ్యమిచ్చింది. ప్రతిపక్షాలు తమ కూటమికి ఐఎన్‌డిఐఏ(ఇండియా) అని నామకరణం చేశారు. రాజ్యాంగ, ప్రజాస్వామిక విలువల పరిరక్షణ, సామరస్యం, సద్భావం, సామాజిక న్యాయం, సమ్మిళిత అభివృద్ధి స్థూలంగా ప్రతిపక్షాల ఎజెండా. వాటన్నింటినీ 9ఏళ్ల బీజేపీ నరేంద్రమోదీ పాలన నాశనం చేసింది. అందువల్ల ఈ కూటమి ఐఎన్‌డిఐఏ పేరుపెట్టుకోవడం అర్థవంతంగా ఉంది. ఈ పొడి అక్షరాల పూర్తి రూపం 'ఇండియన్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయెన్స్' (భారత జాతీయ అభివృద్ధి సమ్మిళిత కూటమి).

రాజ్యాంగం దేశ ప్రజలకు హామీ ఇచ్చిన ఇండియా భావనకు 'భిన్నత్వంలో ఏకత్వ' పరిరక్షణ పునాది. ప్రజాస్వామ్యం, సమాఖ్యవ్యవస్థ, రాజ్యాంగ అంగాల మధ్య అధికారాల విభజన, చట్టబద్ధపాలన, మతసహనం, సామరస్యం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం అందించడం దాని స్థూల సారాంశం. ఈ ఆదేశాలకు విరుద్ధంగా సాగుతున్న బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ పాలనకు అంతం పలికే సంకల్పంతో ఐక్యమవుతున్నాయి ప్రతిపక్షాలు. ముంబైలో జరిగే తదుపరి సమావేశంలో 11 మంది సభ్యులతో ఒక సారథ్య సంఘాన్ని ఏర్పాటు చేస్తామని, ఒక కన్వీనర్‌ను నియమిస్తామని బెంగళూరు సమావేశానికి ఆతిథ్యమిచ్చిన కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీకి ప్రధాని పదవిపై ఆశలేదని కూడా స్పష్టం చేశారు. అయితే 2024 ఎన్నికల తదుపరి దళితుడు ప్రధాని అవుతారని దళితనేత అయిన ఖర్గే చెప్పడం ఆసక్తిదాయకం!

ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో ఢిల్లీలో మంగళవారం మరో వింతైన సమస్య జరిగింది. ఎప్పుడో మరిచిపోయిన ఎన్‌డీఏ పేరుతో చాలా పార్టీలను పోగుచేసి ఒక షో నిర్వహించారు. ఎన్‌డీఏకు పాతికేళ్లు అన్నారు. 2017 ఏప్రిల్ 10న ఢిల్లీలో సమావేశం తదుపరి ఎన్‌డీఏకి ఇదే మలి సమావేశం. 2014 నుంచీ దేశంలో సాగుతున్నది నరేంద్రమోదీ భజన, ఏకవ్యక్తిపాలనే కదా! పేరుకు ఎన్‌డీఏ తప్ప అంతా డొల్ల. చెప్పుకోదగ్గ బలమైన పార్టీ బీజేపీ తప్ప మరొకటి లేదు. ఎన్‌డీఏలో ఎల్‌జేపీ, లోక్‌దళ్ ఆదిలో శివసేన, అకాలీదళ్, జేడీయూ, తెలుగుదేశం ముఖ్య భాగస్వాములు. ఇప్పుడు వాటి చీలకలు, పీలికలు. ప్రాంతీయ, ఉపప్రాంతీయ పార్టీలు. సంఖ్యాపరంగా 38 అని ఘనంగా చెప్పుకోవచ్చు. 24 పార్టీలకు లోకసభలో ప్రాతినిధ్యంలేదు. మరో 9పార్టీలకు ఒక్కొక్కరు, 2 పార్టీలకు ఇద్దరేసి సభ్యులున్నారు. మోదీ జనాకర్షక శక్తికి తిరుగులేదని విర్రవీగే పాలక పార్టీకి ఇప్పుడీ సమీకరణ అవసరమేమొచ్చింది ? ప్రతిపక్షాల సమీకరణ కలవరం కలిగించి ఉండవచ్చు. హిమాచల్‌ప్రదేశ్, కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అధికారం కోల్పోయినతదుపరి 2024 ఎన్నికలో ఓటమి భయం ఏమూలనో పీడిస్తుందనవచ్చు.

ఇండియా, ఎన్‌డీఏ సమావేశాలకు హాజరైన శ్రేణులను పరిశీలించుదాం. బెంగళూరు సమావేశానికి హాజరైన వారిలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, సోనియాగాంధి, రాహుల్‌గాంధి, ప.బెంగాల్, ఢిల్లీ, తమిళనాడు, జార్ఖండ్, కర్నాటక, ముఖ్యమంత్రులు వరుసగా మమతాబెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్, ఎం.కె.స్టాలిన్, హేమంత్ సోరేన్, ప్రతిపక్ష నాయకుడు అఖిలేష్‌యాదవ్,

సీపీఐ, సీపీఐ(ఎం), సీపీఐ(ఎంఎల్) ప్రధానకార్యదర్శులు వరుసగా డి.రాజా, సీతారం ఏచూరి, దీపాకంర్ భట్టాచార్య, శివసేన (ఉద్ధవ్) అధ్యక్షుడు ఉద్ధావ్ థాక్రే, ఎన్‌సీపీ నేత శరద్‌పవర్, ఆర్‌జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్‌యాదవ్ తదితరులున్నారు.

బీజేపీ సమరాంగణంలో 'షో' అంతా మోదీదే. ఆ సమావేశం గ్రూపు ఫొటోలో గుర్తించగలిగినవారు కొద్దిమందే. ముందు వరుసలో వరుసగా కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, నాగాలాండ్ ముఖ్యమంత్రి నెఫ్యూరియో, రాజ్‌నాథ్‌సింగ్, ఏఐఏడీఎంకె నేత ఇ.పళనిస్వామి, ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ అధ్యక్షుడు జెపి నడ్డా, మహారాష్ట్ర సంకీర్ణ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండె, హోం మంత్రి అమిత్ షా ఉన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఏకైక ప్రతినిధి. రాంవిలాస్ పాశ్వాన్ కుమారుడు చిరాగ్ పాశ్వాన్ తిరిగి బీజేపీ చెంతచేరిన మొక్కటే కొత్త వార్త. ఆయన బాబాయి పశుపతిపరాశ్ గ్రూపు ఇప్పటికే ఎన్‌డీఏలో భాగస్వామిగా మోదీ మంత్రివర్గంలో ఉన్నారు.

ఎన్‌డీఏ వ్యవస్థాపక భాగస్వాములైన శివసేన, అకాలీదళ్, జెడీ(యు) టీడీపీ ఇప్పుడు బైటకు వెళ్లిపోయాయి. శివసేనను చీల్చి ఒక ముక్కను వెనక్కు తెచ్చుకుంది. ప్రతిపక్షంలో కీలకపాత్ర పోషిస్తున్న శరద్‌పవార్‌ను దెబ్బ తీసేందుకై ఆయన సోదరుని కుమారుడు అజిత్‌పవార్ నాయకత్వంలో ఒక గ్రూపును బైటకు లాగింది. మంత్రి పదవులతో సత్కరించింది. తెలుగుదేశం డోలాయమానంలో ఉంది. మోదీ పిలుపుకొరకు వేచిచూస్తున్నట్లు వదంతులున్నాయి. ఏమైనా ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ, టీడీపీ, జనసేన కలిసి పోటీచేస్తాయని పవన్ కళ్యాణ్ పట్టువదలకుండా చెబుతున్నారు. జగన్ మోహన్‌రెడ్డితో స్నేహమే మేలని బీజేపీ అధినాయకత్వం భావిస్తున్నట్లుంది.

మూడవ పర్యాయం విజయం తమదేనని జబ్బలు చరిచే బీజేపీకి ఈ చిన్న చితక ఊతకర్రల అవసరమెందుకొచ్చిందో ఆలోచించదగ్గ విషయం. తమ రాష్ట్ర ప్రభుత్వాల పాలనపట్లనేగాక మోదీ డంబాచార ప్రచారం మాటున సాగిస్తున్న ప్రజాస్వామ్య వ్యతిరేక పరిపాలనపట్లకూడా ప్రజల్లో వ్యతిరేక భావం పెరుగుతున్నదని,మోదీ ఆకర్షణ మసకబారుతున్నది బీజేపీ వారు గ్రహించారనవచ్చు. గత సంవత్సరం హిమాచల ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో మోదీ జనాకర్షణపై తొలి దెబ్బ తగిలింది. కాంగ్రెస్‌కు ప్రజలుపట్టం కట్టారు. ఇటీవల కర్నాటక ఎన్నికల్లో ప్రధాని మోదీ తానే అభ్యర్థి అన్నట్లుగా తిరిగినా, వేలకోట్ల రూపాయల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసినా, రోడ్‌షోలు చేసినా, ముస్లిం వ్యతిరేక మత మనోభావాలు ప్రేరేపించే దిగజారుడు ప్రసంగాలు చేసిని ఓటర్లు బీజేపీని ఓడించి కాంగ్రెస్‌కు అధికారమిచ్చారు. ఈ ఎన్నికలు భారత రాజకీయాల్లో ఒక టర్నింగ్‌పాయింట్ తెచ్చాయి. ప్రతిపక్షాల్లో ఉత్సాహం నింపాయి. బీజేపీకి బలమైన హెచ్చరిక చేశాయి. ఆ తర్వాత, బీజేపీతనకు అలవాటైన ఫిరాయింపుల నాటకాన్ని మహారాష్ట్రలో నడిపింది.

ప.బెంగాల్ పంచాయితీ కూడా ఎన్నికల్లో ఎదురుదెబ్బ

ఇటీవల జరిగిన పశ్చిమబెంగాల్ పంచాయతీ ఎన్నికల ఫలితాలు కూడా బీజేపీ తిరోగమనాన్ని సూచిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో హింస, మరణాలు ప్రధానంగా వార్తల్లోకి వచ్చాయి. 42 మంది చనిపోయారు. వందలమంది క్షతగాత్రులయ్యారు. హింసాత్మక చర్యలను ఖండించాల్సిందే. అయితే బెంగాల్‌కివి కొత్తకాదు. స్థానిక పెత్తనంకోసం పోరులో ఇతర రాష్ట్రాల్లోనూ అటువంటి ఘటనలు జరుగుతుంటాయి. వాటినిచూచి ఫలితాల ప్రాధాన్యతను విస్మరించరాదు.

గ్రామీణ బెంగాల్‌లో బీజేపీ సీటు వాటా 2021 అసెంబ్లీ ఎన్నికల్లో లభించిన 38.1 శాతం నుంచి 22.88 శాతానికి తగ్గింది. 16శాతంపైగా ఓట్లు పడిపోవడం సాధారణ విషయం కాదు. బీజేపీ విస్తరణ ప్రధానంగా గ్రామీణప్రాంతాలు, చిన్న పట్టణాల్లో జరిగినందున భారీగా ఓట్లు పతనం పెద్ద ఎదురుదెబ్బ. మిగతా అన్నిపార్టీల ఓట్ల శాతం పెరిగింది. బీజేపీకి 2019 లోకసభ ఎన్నికల్లో 18సీట్లు, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో 77 సీట్లు ఇచ్చిన ఓటర్లలో కొంతభాగం తిరిగి తమ పూర్వ విధేయతకు మరలటం ఆరంభంకావటాన్నిది సూచిస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో గ్రామీణ బెంగాల్‌లో 47.93శాతం ఇప్పుడు తన వాటాకు 51.54 శాతానికి పెంచుకుంది. ఓటు వాటా 4శాతానికి పడిపోయి, అసెంబ్లీలో ప్రాతినిధ్యం సైతం కోల్పోయిన సీపీఐ (ఎం)కు12.96శాతం ఓట్లు లభించడం ప్రత్యేక ప్రాధాన్యత గల అంశం. వామపక్ష ఓటర్లు టిఎంసి, బీజేపీ బీభత్సకాండ నుండి నెమ్మదిగా తేరుకుంటున్నదనవచ్చు. దాని అలయన్స్ పార్టనర్ ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్‌కు1శాతం ఓట్లు లభించాయి. కాగా కాంగ్రెస్ ఓటు వాటాకూడా 6.42శాతానికి పెరిగింది. బీజేపీ గత లోకసభ ఎన్నికల్లో గెలుచుకున్న 18 సీట్లను వచ్చే ఎన్నికల్లో నిలుపుకోవటం దుర్లభమని పంచాయతీ ఎన్నికల ఫలితాలు హెచ్చరిస్తున్నాయి. అయితే 42లో 34సీట్లు గెలుచుకోవాలన్న మమతా బెనర్జీ ఆశ నెరవేరుతుందా?

సీనియర్ జర్నలిస్టు

నదీబోర్డుల ప్రేక్షకపాత్ర


వి. శంకరయ్య

రాష్ట్ర విభజన చట్టం ద్వారా ఏర్పడిన కృష్ణ, గోదావరి నదీ యాజమాన్య బోర్డులు వ్యవహరిస్తున్న సరళి పరిశీలిస్తే ఎట్టి అధికారాలు లేని సంస్థలేనా అనే అనుమానం కలుగుతోంది. విభజన చట్టం సెక్షన్ 85 మేరకు ఇవి ఏర్పాటు అయ్యాయి. సెక్షన్ 85 సబ్ సెక్షన్ (3)లో ఇవి కేంద్ర ప్రభుత్వం అధీనంలో పని చేసే స్వయం ప్రతిపత్తి గల సంస్థలుగా పేర్కొన్నారు. కాలక్రమంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆదేశాలు అమలు చేయవలసి వుంది. కాగా ఈ బోర్డుల రోజు వారీ కార్యక్రమాలు నిర్వహణతోపాటు అధికారాల గురించి సబ్ సెక్షన్(8)లో స్పష్టంగా పేర్కొన్నారు. అయితే ఇవి ఆచరణలో ఎట్టి ప్రయోజనం లేనివిగా తయారయ్యాయి. ఇందులో కేంద్ర ప్రభుత్వ సాచివేత ధోరణి కూడా తోడైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి కొత్త రాష్ట్రాలు ఏర్పడిన ఆరు మాసాల్లో కేంద్ర ప్రభుత్వం నదీ బోర్డులను నియమించవలసి వుంది. కాని కృష్ణానదీ జలాల వివాదం బాగా ముదిరేంత వరకు యాజమాన్య బోర్డును ఏర్పాటు చేయలేదు. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు వచ్చే వరకు ఆగవలసినదిగా తెలంగాణ మోకాలడ్డితే కేంద్రం కొంతకాలం ప్రేక్షక పాత్ర వహించింది. ఆఖరుకు సాగర్ ఆనకట్టపై ఇరు రాష్ట్రాల పోలీసులు పరస్పరం తలపడవలసి వచ్చింది. ఎట్టకేలకు కేంద్రం కృష్ణా యాజమాన్య బోర్డును నియమించింది. తెలంగాణ కోరినట్లు ట్రిబ్యునల్ తీర్పు రాకమునుపే బోర్డును నియమించిన కేంద్రం ఆ పని ముందుగానే ఎందుకు చేసి వుండకూడదు? రాష్ట్రాల మధ్య పోట్లాట పెట్టడంగా భావించాలి.

ఇంత జరిగినా బోర్డు నోటిపై మేరకు తన అధీనంలోని ప్రాజెక్టులను తెలంగాణ ఇప్పటికీ స్వాధీనం చేయకుండా మొండివాడు రాజుకన్నా బలవంతుడని రుజువు చేస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర విభజన తర్వాత కృష్ణా నదీజలాలను రెండు రాష్ట్రాల మధ్య పంపిణీ చేయవలెనో విభజన చట్టం సెక్షన్ 85 సబ్‌సెక్షన్ 8(1) లో స్పష్టత వుంది. అయినా తెలంగాణ తరచూ ప్రతి వేదిక మీద ఫిఫ్టీ ఫిఫ్టీ సిద్ధాంతం తెర మీదకు తెస్తోంది.

రాష్ట్ర విభజన చట్టం ఏం చెబుతోందో ఆ మేరకు నిర్ణయాన్ని యాజమాన్య బోర్డు తీసుకోకుండా ఏలాంటి నిర్ణయం గైకొనాలనో తెలియజేయమని కేంద్ర జలవనరులశాఖకు గత మే నెలలో నివేదించింది. ఇది జరిగిన కొన్నాళ్లకు జూన్ నెలలో కేంద్ర జలవనరుల శాఖ బోర్డు అభిప్రాయం చెప్పమని తిరుగు టపాలో పంపింది. వాస్తవంలో కేంద్రం జలవనరులశాఖకు వాటాలుతేల్చే అధికారం లేదు. కేంద్ర జలవనరుల శాఖ గాని యాజమాన్య బోర్డు గాని రాష్ట్ర విభజన చట్టం ఏం చెబుతోందో ఆ విధంగా నిర్ణయం తీసుకోవాలి. మే నెలలో జరిగిన బోర్డు సమావేశంలో తెలంగాణ తెగేసి బోర్డుకు అధికారం లేదని వాదిస్తే బోర్డు ప్రేక్షక పాత్ర వహించింది. విభజన చట్టం మేరకు ఏర్పడిన బోర్డుకు విభజన చట్టం ఏం చెబుతోందో అమలుచేసే అధికారం లేకపోతే ఎవరికి వున్నట్లు?

కృష్ణా యాజమాన్య బోర్డు తీరు ఇలా వుండగా తాజాగా



గోదావరి నదీ బోర్డు డొల్లతనమూ బహిర్గతమైంది. రాష్ట్ర విభజన తర్వాత కృష్ణా, గోదావరి నదులపై ఏ రాష్ట్రమైనా కొత్త ప్రాజెక్టుల నిర్మాణం చేపడితే ముందుగా డిపిఆర్‌లను బోర్డుకు సమర్పించాలి. బోర్డు పరిశీంచి అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో పెట్టాలి. అపెక్స్ కౌన్సిల్ ఆమోదం పొందిన తర్వాతనే కేంద్ర జల సంఘంతో పాటు పర్యావరణ అనుమతులు పొందాలి. గండర గండడుగా పేరు పొందిన ముఖ్యమంత్రి కెసిఆర్ కొన్ని పాత ప్రాజెక్టులను రద్దుచేసి మరో చోట (ఇలా మార్పు చేస్తే కొత్త ప్రాజెక్టులని కేంద్ర జల వనరుల శాఖ ఆదేశాలు వున్నాయి) కొత్త ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టి ఇవి పాత ప్రాజెక్టులేనని చెప్పి అపెక్స్ కౌన్సిల్ అగడ్త దాటుతున్నారు. పాలమూరు రంగారెడ్డితో పాటు సీతారాముల ఎత్తిపోతలు ఆఖరుకు కాళేశ్వరం కూడా ఈ కోవకు చెందినదే. తాజాగా సీతమ్మ సాగర్ రచ్చకెక్కింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాజీవ్ దుమ్ము గూడెం ఎత్తిపోతల పథకం ఇందిర సాగర్ రుద్రమకోట ఎత్తిపోతల రెండు పథకాలు ఆమోదంపొందాయి. కాని ముఖ్యమంత్రి కెసిఆర్ ఈ రెండు పథకాలు అమలులో వున్నా వాటి స్థానంలో సీతా రామ ఎత్తిపోతల పథకం తెర మీదకు తెచ్చారు. దీన్ని రెండు ఫేస్‌లుగా నామ కరణం చేసి(ఫేస్ ఒకటికి) సీతారామ ఎత్తిపోత లకు పర్యావరణ అనుమతులు పొందారు. రెండవ ఫేస్‌కు సీతమ్మ సాగర్ అని నామకరణం చేసి ఎప్పుడో బ్రిటీష్ కాలంలో సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన దుమ్ము గూడెం అలుగు (వేర్) కింద భాగంలో బ్యారేజీ నిర్మాణం చేస్తున్నారు. సీతమ్మ సాగర్ బ్యారేజీ బహుళార్థ సాధక ప్రాజెక్టు. సాగునీటితో పాటు విద్యుదుత్పత్తి కూడా వుంటుంది. ఇంతటి ప్రాధాన్యత గల పథకానికి డిపిఆర్ ఆమోదం తుదకు పర్యావరణ అనుమతులు కూడా పొందలేదు. ఈ అంశం గ్రీన్ ట్రిబ్యునల్‌కు చేరింది. ఈ దేశంలో రాజకీయ కార్యనిర్వాహక వ్యవస్థ భ్రష్టు పట్టిపోయినా న్యాయ వ్యవస్థ కొన ఊపిరితోనైనా బతికి వుంది కాబట్టి సరిపోతోంది. ఇందుకు చెందిన కోర్టు ధిక్కరణ కేసు ఇటీవల విచారణ చేసిన సందర్భంగా గ్రీన్ ట్రిబ్యునల్ గోదావరి యాజమాన్య బోర్డు నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఎండ గట్టింది. గోదావరి యాజమాన్య బోర్డు వేసిన అఫిడవిట్‌ను తూర్పార పట్టింది. గ్రీన్ ట్రిబ్యునల్ మధ్యంతర ఉత్తర్వులు ధిక్కరించి పనులు సాగిస్తున్న తెలంగాణపై చర్యలు తీసుకొనే అధికారం తమకు లేదని బోర్డు వేసిన అఫిడవిట్‌లో వుంది. అఫిడవిట్ పరిశీలించిన గ్రీన్ ట్రిబ్యునల్ చెన్నై బెంచి బోర్డుకు అధికారం లేకపోతే 2021 లోనే డిపిఆర్ తదితర అనుమతులు లేకుండా పనులు సాగించకూడదని ప్రభుత్వానికి నోటీసు ఎలా ఇచ్చారని నిలదీసింది. బోర్డు కార్యదర్శి నుండి ఈ వివరాలు తెలుసుకోదలచినట్లు వ్యాఖ్యానించింది

తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న సీతమ్మ సాగర్ అంశంలో గ్రీన్ ట్రిబ్యునల్ చేసిన వ్యాఖ్యానం ఒక విధంగా మంచిదైంది. ఈ కామెంట్ ఒక్క గోదావరి బోర్డుకే పరిమితం కాదు. కృష్ణానదీ జలాల పంపిణీకి ప్రతి నిత్యం తెలంగాణ పెడుతున్న పేచీలకు ఒక మార్గ నిర్దేశం చేస్తుంది. కృష్ణా, గోదావరి నదీ జలాల పంపిణీ విషయంలో బోర్డుల పాత్ర అధికారాలకు గ్రీన్ ట్రిబ్యునల్ మున్ముందు చెప్పే తీర్పు ఒక పరిష్కారం చూపవచ్చేమో! విభజన చట్టం మేరకు నియమించిన బోర్డుల అధికారాలపై ఒక స్పష్టత రావడం ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో మేలు చేస్తుంది. రెండు వారాల క్రితం బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తెలంగాణకు వాత పెడితే తాజాగా గ్రీన్ ట్రిబ్యునల్ చెన్నై బెంచి ఝలక్ ఇచ్చింది.

విశ్రాంత పాత్రికేయులు, 9848394013

'ఇండియా' వెనుక కథేంటి?

- దీనిని ఎవరు సూచించారు... ప్రత్యామ్నాయాలేంటి?
- విపక్ష కూటమి పేరు వెనుక వాదనలు, ఎంపికలు

బెంగళూరు: 'ఇండియా' ఇప్పుడు దేశమంతటా ప్రతిపక్ష పార్టీల బలాన్ని సూచిస్తున్న పదం. కేంద్రంలోని మోదీ నేతృత్వంలోని అధికార ఎన్డీఏ కూటమిని 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓడించేందుకు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసం 26 విపక్ష పార్టీలు కొత్తగా కూటమి ఏర్పాటు చేసుకున్నాయి. దానికి ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంట్ ఇన్‌క్లూజివ్ అలయన్స్ (ఇండియా-భారత జాతీయ సమ్మిళిత అభివృద్ధి కూటమి) అనే పేరును మంగళవారం బెంగళూరులో జరిగిన మేథో మథన సదస్సులో ప్రకటించాయి. అయితే ఆ పేరును సూచించిందెవరు... ప్రత్యామ్నాయాలేమిటి... అనే విషయాలను పరిశీలిస్తే... ఈ ప్రతిపక్ష కూటమి ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయన్స్‌కి సంక్షిప్త రూపమైన 'ఇండియా' పేరును నిర్ణయించడానికి ముందు రెండు రోజుల చర్చలు, అనేక సూచనలు వచ్చాయని, రాహుల్ గాంధీకి ఈ ఆలోచన వచ్చిందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ సమావేశానికి ముందు కొన్ని మిత్రపక్షాలకు ఈ పేరును సూచించింది. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు డెరెక్ ఓబ్రెయిన్‌తో సహా గాంధీల సన్నిహితుడు కాంగ్రెస్ నాయకుడు కె.సి.వేణుగోపాల్ ప్రతిపక్ష నాయకులతో అనేక సంభాషణలు జరిపినట్లు సమాచారం. ప్రతిపక్ష కూటమి సమావేశంలో కూటమికి 'ఇండియా' పేరును ప్రతిపాదించింది మమతా బెనర్జీ. పేరు సూచించిన తర్వాత, వివిధ పార్టీలు మరిన్ని ఎంపికలను తెరపైకి తెచ్చాయి. ఉదాహరణకు, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఇండియా మెయిన్ అలయన్స్ (ఐఎంఏ) లేదా ఇండియా మెయిన్ ఫ్రంట్ (ఐఎంఎఫ్) అని సూచించినట్లు తెలుస్తోంది. ఆ వర్గాల సమాచారం ప్రకారం, 'ఇండియా' అనే పేరు (నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్) లాగానే ఉందన తీఇనితీష్ కుమార్ భావించారు. రాజకీయ కూటమికి 'ఇండియా' పేరు ఎలా అవుతుందని కూడా ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ తమిళనాడు మిత్రపక్షం విడుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే) సేవ్ ఇండియా అలయన్స్‌ను సూచించింది. వామపక్షాలు 'వియ్ ఫర్ ఇండియా' కూటమిని సూచించినట్లు సమాచారం. కానీ చాలా మంది అది నినాదంలా అనిపించిందని భావించారు. అయితే అనేక చర్చల తర్వాత, కూటమికి 'ఇండియా' అనే పేరును పార్టీలు అంగీకరించాయి. రాహుల్ గాంధీ చివరగా మాట్లాడుతూ 'ఇండియా' పేరును గట్టిగా నొక్కిచెప్పారని కాంగ్రెస్ పేర్కొంది. ప్రతిపక్షాలు 'భారత్ వర్సెస్ ఎన్డీఏ' కథనాన్ని సృష్టించగలవని ఆయన వాదించారు.

విలేకరుల సమావేశంలో ఆయన దీనిని 2024 సార్వత్రిక ఎన్నికల కోసం 'మోదీ వర్సెస్ ఇండియా' యుద్ధం అని కూడా పేర్కొన్నారు. 'మేము రాజ్యాంగాన్ని, భారతీయుల గొంతును, భారతదేశ భావనను పరిరక్షిస్తున్నాము. భారతదేశం భావనతో పోరాడాలనుకునే ఎవరికైనా ఏమి జరుగుతుందో మీకు తెలుసు. ఈ పోరాటం ఎన్డీఏ-ఇండియా, నరేంద్ర మోదీ-ఇండియా, అలాగే అతని సిద్ధాంతం-ఇండియా మధ్య ఉందని తెలిపారు. భారతదేశం ఎల్లప్పుడూ అన్ని పోరాటాలను గెలుస్తుందని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు తెలిపారు. 'ఈ పోరాటం భారతదేశం రెండు విభిన్న ఆలోచనల గురించి, దేశం గొంతు అణచివేతకు గురవుతోంది. పోరాటం దేశం గొంతు కోసం. అందువల్లే 'ఇండియా' అనే ఈ పేరును ఎంచుకున్నాము' అని రాహుల్ గాంధీ వివరించారు. 'ఇండియా' నిజానికి ఇండియన్ నేషనల్ డెమొక్రటిక్ ఇన్‌క్లూజివ్ అలయన్స్‌గా భావించడం జరిగింది. కానీ కొన్ని పార్టీలు నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్‌కు సమానమైన అర్థాన్ని కలిగి ఉన్నాయని ఎత్తి చూపాయి. అలాగే కొంతమంది నాయకులు 'ప్రజాస్వామ్యం' అంటే 'సమష్టి' అని కూడా అర్థమని, అందువల్ల అది పునరావృతమవుతుందని వాదించారు.

చివరగా, ఇండియాలోని 'డి'... 'అభివృద్ధి' అని నాయకులు నిర్ణయించారు. అయితే, కొత్త పేరును ప్రకటించేటప్పుడు కొందరు 'ప్రజాస్వామ్యం' అని, మరికొందరు 'అభివృద్ధి' అని పేర్కొంటూ వేర్వేరు నాయకులు చేసిన పోస్ట్‌లు గందరగోళానికి కారణమయ్యాయి. ఇదిలాఉండగా, ప్రతిపక్షాలు పేరును ప్రకటించిన వెంటనే, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎన్డీఏ కోసం కొత్త అర్థాన్ని సూచించారు. 'న్యూ ఇండియా, డెవలప్‌డ్ నేషన్, యాస్పిరేషన్ ఆఫ్ ఇండియా' (నూతన భారతదేశం, అభివృద్ధి చెందిన దేశం, భారత ప్రజల ఆకాంక్ష) అని పేర్కొన్నారు.

నితీశ్ అసంతృప్తి ... వదంతులే

జేడీయూ స్పష్టీకరణ

పాట్నా: విపక్ష కూటమికి 'ఇండియా'గా నామకరణం చేయడం పట్ల బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ అసంతృప్తి వ్యక్తంచేసినట్లు వచ్చిన వార్తలను జేడీయూ రాష్ట్ర అధ్యక్షుడు రంజన్‌సింగ్ లాలన్ ఖండించారు. రంజిత్‌సింగ్ బుధవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ నితీశ్ కుమార్ 'ఇండియా' అనే సంక్షిప్తనామం పట్ల అసంతృప్తిగా ఉన్నారని, కొత్త సంకీర్ణానికి తనను కన్వీనర్‌గా నియమించనందుకు గుర్రుగా ఉన్నారని వస్తున్న వదంతులను కొట్టిపడేశారు. ఇది (వదంతుల సృష్టి) బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ చేస్తున్న దుష్ప్రచారమని ఆయన మండిపడ్డారు. విపక్ష సమావేశానికి హాజరైన నేతలందరూ ఇండియా అనే పేరుకు ఆమోదముద్ర వేశారని ఆయన తెలిపారు. నితీశ్ కుమార్‌ను ఫ్రంట్ కన్వీనర్‌గా చేస్తారనే ఊహాగానాలపై స్పందిస్తూ బెంగళూరు సమావేశంలో కన్వీనర్ నియామకం అజెండా ఏమీ లేదని, తదుపరి సమావేశం ముంబైలో దీని ప్రస్తావన రావచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కన్వీనర్‌గా చేయనందుకు అసంతృప్తితో నితీశ్ కుమార్ విలేకరుల సమావేశానికి దూరంగా ఉన్నారని బీహార్ బీజేపీ నేత సుశీల్ కుమార్ మోదీ వంటి నేతలు వ్యాఖ్యానించడంపై స్పందిస్తూ వారు ప్రచారం కోసం తహతహలాడుతూ...ఇలాంటి చౌకబారు విమర్శలకు దిగుతున్నారని లాలన్ విమర్శించారు. ప్రతిపక్ష ఐక్యతకు నితీశ్ కుమార్ సూత్రధారి... అలాంటి వ్యక్తి అసంతృప్తి, ఆగ్రహావేశాలకు లోనవడం జరగదన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ హడావుడిగా ఎన్డీఏ సమావేశం నిర్వహించడం ఆయన భయానికి, నిరాశనిస్పృహకు నిదర్శనమని లాలన్ వ్యాఖ్యానించారు.

ఆగస్టు 7నుంచి కేరళ అసెంబ్లీ సమావేశాలు

తిరువనంతపురం: కేరళ అసెంబ్లీ సమావేశాలను ఆగస్టు 7వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. ఈ మేరకు గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌కు సిఫార్సు చేయాలని కేరళ ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ అధ్యక్షతన బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. అర్ధ శతాబ్దానికి పైగా అసెంబ్లీ కార్యక్రమాల్లో భాగమైన కాంగ్రెస్ సీనియర్ నేత ఊమెన్ చాందీ మరణానంతరం జరగనున్న అసెంబ్లీ తొలి సెషన్ ఇది. చాందీ 1970 నుంచి వరుసగా 12 సార్లు పుతుపల్లి నియోజకవర్గం నుంచి శాసనసభ సభ్యునిగా ఎన్నికయ్యారు. చాందీ మృతికి విచారాన్ని, ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ కేబినెట్ భేటీ తీర్మానాన్ని ఆమోదించారు. కేరళకు ఆయన చేసిన సేవలను, ప్రజల సంక్షేమాన్ని కూడా గుర్తుచేసుకున్నట్లు సీఎంఓ ఓ ప్రకటనలో పేర్కొంది.

మాది ఒంటరి పోరు: మాయావతి

న్యూఢిల్లీ: లోక్‌సభతో పాటు మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో తమ పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి చెప్పారు. పంజాబ్, హరియాణాల్లో ప్రాంతీయ పార్టీలతో పొత్తుకు బీఎస్పీ సిద్ధంగా ఉందని బుధవారం ఒక ప్రకటనలో మాయావతి తెలిపారు. అయితే, ఆయా ప్రాంతీయ పార్టీలకు అధికార ఎన్డీఏ కూటమి లేదా కొత్తగా ఏర్పడిన ప్రతిపక్ష కూటమి 'ఇండియా'తో ఎలాంటి స్నేహం ఉండకూడదని మాయావతి షరతు విధించారు. ఎన్డీఏ, ఇండియా దొందూ దొందేనని ఆమె దుయ్యబట్టారు. ఈ రెండు కూటములు దళితులు, అణగారిన వర్గాలకు వ్యతిరేకమని మాయావతి ఆరోపించారు. దేశవ్యాప్తంగా బీఎస్పీ కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి, పార్టీని బలోపేతం దిశగా ప్రణాళికలు రూపొందిస్తోందని ఆమె తెలిపారు. కాంగ్రెస్ కులతత్వ ధోరణి అవలంబించింది. అణగారిన వర్గాల డిమాండ్లను విస్మరించింది. అందుకే ఆయా వర్గాలు బీఎస్పీకి మద్దతుగా నిలవాలని ఆమె కోరారు. కాంగ్రెస్ తన కులతత్వ, పెట్టుబడిదారీ ఆలోచనలను పక్కనపెట్టి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మాటలు విని.. పేదలు, అణగారిన ప్రజల సంక్షేమం కోసం పాటు పడి ఉంటే, బీఎస్పీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉండేది కాదని మాయావతి అన్నారు.

అజిత్ పవార్ ప్రజలకోసం పనిచేసే నేత: ఉద్ధవ్

ముంబై: మహారాష్ట్ర రాజకీయాలు కొద్దిరోజులుగా అనూహ్య మలుపులు తిరుగుతున్న నేపథ్యంలో బుధవారం మరో ఆసక్తికర ఘట్టం చేటుచేసుకుంది. ఎన్సీపీలో తిరుగుబావుటా ఎగురవేసి, బీజేపీ-శివసేన ప్రభుత్వానికి మద్దతు ప్రకటించడం ద్వారా కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖలను సొంతం చేసుకున్న అజిత్ పవార్ ను శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, ఆయన కుమారుడు ఆదిత్య ఠాక్రే కలుసుకున్నారు. ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వంలో అజిత్ పవార్ చేరిన తర్వాత ఆయనను ఉద్ధవ్ కలుసుకోవడం ఇదే మొదటిసారి. శాసన సభా మండలి సభ్యుడైన ఉద్ధవ్... బుధవారం కొద్దిసేపు సభాకార్యక్రమాల్లో సైతం పాల్గొన్నారు. రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు మంచి సేవలందించాలని అజిత్ పవార్‌ను కోరినట్టు సమావేశానంతరం మీడియాతో మాట్లాడుతూ ఉద్ధవ్ థాకరే తెలిపారు. తామిద్దరం గత కేబినెట్‌లో కలిసి పనిచేశామని, ఆయన పనితీరు తనకు బాగా తెలుసునని అన్నారు. ఆర్థిక శాఖ మంత్రిగా ఖజానా తాళాలు ఆయన వద్దే ఉన్నందున రాష్ట్ర ప్రజలకు మేలు జరుగుతుందనే నమ్మకం తనకు ఉందన్నారు. మహా వికాస్ అఘాడి ప్రభుత్వంలో ఠాక్రే డిప్యూటీ (ఉప ముఖ్యమంత్రి)గా అజిత్ పవార్ పనిచేశారు. కాగా, నెల మొదట్లో అజిత్ పవార్, మరో 8 మంది ఎన్సీపీ ఎమ్మెల్యేలు షిండే ప్రభుత్వంలో చేరడంతో శరద్ పవార్ స్థాపించిన ఎన్సీపీ నిట్టనిలువునా చీలింది.

దేశాన్ని ప్రేమించే పార్టీలు ఒక్కటయ్యాయి

దేశాన్ని, మాతృభూమిని ప్రేమించే పార్టీలు ఒకే తాటిపైకి వచ్చాయని శివసేన (యుబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. 26 ప్రతిపక్ష పార్టీలు ఇండియా పేరుతో కూటమిని ఏర్పాటు చేసిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నియంతృత్వానికి వ్యతిరేకంగా ఇపుడు బలమైన కూటమి ఏర్పాటైందన్నారు. ఠాక్రే బుధవారం విధాన్ భవన్ ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ తమ పోరాటం ఏ వ్యక్తికి లేదా పార్టీకి వ్యతిరేకం కాదని, నియంతృత్వానికి మాత్రమేనని స్పష్టంచేశారు. నాయకులు, ప్రధానులు, ముఖ్యమంత్రులు వస్తుంటారు... పోతుంటారు. అయితే వారు అనుసరించే విధానాలు దేశానికి చేటు కలిగించవచ్చు...అందుకే మాతృభూమిని ప్రేమించే అన్ని పార్టీలు ఏకతాటిపైకి వచ్చాయి. ఇప్పుడు నియంతృత్వానికి వ్యతిరేకంగా బలమైన ఫ్రంట్ ఏర్పడిందని ఠాక్రే అన్నారు.

ఒక్క నెలలో రూ.3 కోట్లు

టమాటా రైతు మహదానందం

పూనె: టమాటా ధరలు ఆకాశాన్నంటాయి. కిలో ధర రూ.150 నుంచి రూ.200 వరకు పలుకుతోంది. ఎన్నో ఏళ్ల నుంచి టమాటా సాగు చేస్తున్న రైతులకు ఈ ధరలు బాగా కలిసి వచ్చాయి. తాజాగా మహారాష్ట్రలోని పూనెకు చెందిన ఈశ్వర్ గైకర్ టమాటా సాగుతో కేవలం నెల రోజుల్లోనే ఏకంగా రూ.3 కోట్లు సంపాదించాడు. దీంతో ఆ రైతు మహదానందంలో మునిగిపోయారు. తనకు 16 ఎకరాల భూమి ఉందని, ఇందులో ఎన్నో ఏళ్లుగా 12 ఎకరాల్లో టమాటా సాగు చేస్తున్నానని ఈశ్వర్ చెప్పారు. గతంలో ధర లేకపోవడంతో గిట్టుబాటు కూడా వచ్చేది కాదని, 2021లో రూ.15-16 లక్షలు నష్టపోయానన్నారు. గతేడాది స్వల్ప లాభాలు వచ్చాయని, ఈ ఏడాది మే నెలలో తక్కువ ధరల కారణంగా పండించిన టమాటాలను పెద్ద మొత్తంలో పడేయాల్సి వచ్చిందన్నారు. అప్పుడు ఎంతో బాధగా అనిపించిందని, కానీ కొద్ది రోజుల నుంచి ధరలు పెరగడంతో జూన్ 11 నుంచి జులై 18 వరకు రూ.3 కోట్లు సంపాదించానని మీడియాతో ఆనందాన్ని పంచుకున్నారు. ఇన్నేళ్లలో టమాటా ధరలు ఇంత ఎక్కువగా ఎన్నడూ పెరగలేదని, ఇప్పుడు కష్టానికి తగిన ప్రతిఫలం లభించడంతో కుటుంబమంతా ఆనందంగా ఉన్నట్లు ఈశ్వర్ తెలిపారు. భారీ వర్షాలు ఇతరత్రా కారణాలతో టమాటా ఉత్పత్తి తగ్గిపోవడంతో కొద్ది రోజులుగా ధరలు ఆకాశాన్నంటుతున్న విషయం విదితమే.

ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం

ట్రాన్స్‌ఫార్మర్ పేలి 16 మంది దుర్మరణం

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడంతో విద్యుదాఘాతానికి గురై 16 మంది దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో పోలీసులు కూడా ఉన్నారు. అనేకమంది గాయపడ్డారు.

చమోలీ జిల్లా అలకనందా నదిపై గల నిర్మాణంలో ఉన్న వంతెన వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం నమామీ గంగా ప్రాజెక్టులో భాగంగా అలకనందా నదిపై ఉన్న వంతెనకు విద్యుత్ ప్రవాహం జరగడంతో ఈ ఘోరం జరిగింది. ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడం వల్ల వంతెన రెయిలింగ్‌కు విద్యుత్ ప్రవహించి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రమాదంలో 16 మంది మృతి చెందారు. వారిలో పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్, హోంగార్డు ఉన్నారు. ప్రస్తుతం దీనిపై దర్యాప్తు జరుగుతోంది. రెయిలింగ్‌కు విద్యుత్ ప్రవాహం జరగడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నామని ఉత్తరాఖండ్ ఏడీజీపీ వి.మురుగేశన్ వెల్లడించారు. పీపల్‌కోటి అవుట్ పోస్టు ఇన్‌ఛార్జి కూడా మృతి చెందినవారిలో ఉన్నారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం మంగళవారం రాత్రి జరిగిందని చమోలీ ఎస్పీ ప్రమేంద్ర దోవల్ వెల్లడించారు. వంతెన వద్ద ఉన్న భద్రతాసిబ్బంది ఒకరు విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు తమకు సమాచారం అందినట్లు తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 26 మంది మృతి చెందారని, మిగిలిన వారి పరిస్థితి విషమంగా ఉందని వెల్లడించారు. మరోవైపు, ప్రమాదంపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన ఘటనాస్థలాన్ని సందర్శించారు. ఈ ఘటనపై జ్యుడిషియల్ విచారణకు ఆదేశించారు. 'ఇది తీవ్ర దురదృష్టకర ఘటన. సహాయక చర్యల నిమిత్తం పోలీసులు, విపత్తు నిర్వహణ సిబ్బంది ఘటనాస్థలిలో ఉన్నారు. బాధ్యులను కఠినంగా శిక్షిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ ఘటనపై స్థానికంగా తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. విద్యుత్ విభాగం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.

మళ్లీ యమునా నది ఉగ్రరూపం

ప్రమాదస్థాయి దాటి ప్రవాహం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరదలు సంభవించి జనజీవనం అస్తవ్యస్తమైంది. దేశ రాజధాని ఢిల్లీలో యమునా నది మళ్లీ ఉగ్రరూపం దాల్చడం ఆందోళనకు గురిచేస్తోంది. కొద్దిరోజులుగా ఈ నదీ ప్రవాహం తగ్గుముఖం పట్టగా.. బుధవారం ఉదయానికి నీటిమట్టం మళ్లీ ప్రమాదకర స్థాయిని దాటింది. ఢిల్లీలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో యమునానది ఉప్పొంగుతోందని అధికారులు తెలిపారు. కేంద్ర జల కమిషన్ సమాచారం ప్రకారం... బుధవారం ఉదయం 8 గంటల సమయానికి ఢిల్లీ పాత రైల్వే వంతెన వద్ద యమునా నది నీటి మట్టం ప్రమాదకర స్థాయి (205.33 మీటర్లు)ని దాటి 205.48 మీటర్లుగా నమోదైంది. సాయంత్రానికి ఇది 205.72 మీటర్లకు చేరుకుంది. గతవారం యమునా నది నీటిమట్టం ఆల్‌టైం గరిష్ఠానికి చేరి 208.66 మీటర్లుగా నమోదవడంతో ఢిల్లీలోని అనేక ప్రాంతాల్లో వరదలు సంభవించాయి.

వరదనీటిలో తేలియాడిన కార్లు

భారీ వర్షాలు గుజరాత్‌ను అతలాకుతలం చేస్తున్నాయి. మరికొన్ని రోజులు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ క్రమంలో వానల కారణంగా రాజ్‌కోట్, సూరత్, గిర్ సోమనాథ్ జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాలు వరదనీటిలో చిక్కుకుపోయాయి.

మంగళవారం పలుచోట్ల 300 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దాంతో అధికారులు ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించారు. స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ గణాంకాల ప్రకారం.. గిర్ సోమనాథ్ జిల్లాలోని సూత్రపాడ తాలూకాలో అత్యధిక వర్షపాతం నమోదైంది. ప్రస్తుతం జలదిగ్బంధానికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కార్లు, ఇతర వాహనాలు నీటిలో తేలియాడుతున్న వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి. వరదల కారణంగా దుకాణాలు మూసివేశారు. గిర్ సోమనాథ్‌లోని ఓ ప్రాంతంలో మొసలి జనావాసంలోకి ప్రవేశించిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. వరద నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో 43 రిజర్వాయర్లకు హైఅలర్ట్ ప్రకటించినట్లు గుజరాత్ ప్రభుత్వం వెల్లడించింది. మరో 19 రిజర్వాయర్లకు హెచ్చరికలు జారీ చేసింది. ఈ భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు ఎన్డీఆర్ఎఫ్, స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్సెస్‌ను అధికారులు సిద్ధంగా ఉంచారు. కాగా, జులై 22 వరకు ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు.

క్షణక్షణం...భయం భయం

- మణిపూర్‌లో చల్లారని హింస
- శాంతి కావాలంటున్న ప్రజలు
- అదనపు బలగాలను మోహరించాలని వేడుకోలు

చురచంద్‌పూర్/బిష్ణుపూర్: మణిపూర్‌లో కొద్ది నెలలుగా జరుగుతున్న జాతుల ఘర్షణ కారణంగా దాదాపు 150 మందికి పైగా చనిపోవడంతో పాటు 25 గ్రామాలు, 350 చర్చిలు, క్వార్టర్లు దహనం కావడమే గాక 70 వేల మందికిపైగా ప్రజలు వలసపోయారు. అయితే మెయితీలు, కుకీ జాతుల మధ్య జరుగుతున్న దాడులతో ఆయా గ్రామాల్లోని ఇతర ప్రజానీకం క్షణక్షణం భయం భయంగా జీవిస్తున్నారు. ఏ మూల నుంచి తుపాకీ బుల్లెట్ దూసుకు వస్తుందో... బాంబు వచ్చి నెత్తిన పడుతుందేమోనని బిక్కుబిక్కు మంటూ కాలం గడుపుతున్నారు. క్వాక్టా మున్సిపల్ పరిధిలోని ఫుల్‌జాంగ్, ఫోగాక్చావో గ్రామాల మధ్య వార్డ్ నంబర్ 9లో అప్రకటిత తుపాకీ కాల్పులు, అధికారుల నిస్సహాయ వైఖరి కారణంగా అక్కడి ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అక్కడి చిన్న చిన్న గుడిసెల పైకప్పులు, మట్టి గోడలపై తుపాకీ గుండ్లు దూసుకుపోయిన రంధ్రాలతో నిండిపోయి ఉన్నాయి. ఇళ్లలోపల ఫర్నీచర్, వంటగది పాత్రలు సైతం లెక్కలేనన్ని రంధ్రాలతో నిండి ఉన్నాయి. ఇవన్నీ చూస్తుంటే వీరంతా ఎంతటి ప్రమాదకర స్థితిలో ఉన్నరో అర్థమవుతుంది. ఫోగాక్చావో గ్రామంలో వాహిద్ రెహ్మాన్ అనే వ్యక్తి అక్కడి వారు ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితిని వివరించాడు. 'భవిష్యత్తుపై ఆశలు వదులుకుని మేము ప్రమాదం అంచున జీవిస్తున్నాము. రెండు వైపుల నుంచి అకస్మాత్తుగా కాల్పులు ప్రారంభమవుతాయి... ఇది గంటల తరబడి కొనసాగుతుంది. మా తోటి గ్రామస్తులు కొంతమంది ఈ స్థితి నుంచి తప్పించుకోవడానికి సమీపంలోని బంధువుల వద్దకు పారిపోవడాన్ని మేము చూశాము. కానీ ఎక్కడికీ వెళ్లలేని మాలాంటి వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కు బిక్కు మంటూ బతకాల్సి వస్తుంది' అని ఆయన చెప్పారు. 'ఈ ప్రదేశానికి కేవలం రెండు మూడు కి.మీ దూరంలో మేలో మెయితీ, కుకీ జాతి ప్రజల మధ్య ఘర్షణలు మొదలయ్యాయి. అప్పటి నుంచి మాకు గడ్డు కాలం మొదలైంది.

స్థానిక ఎమ్మెల్యే లేదా ఏ ప్రభుత్వ అధికారులు మా బాధను పట్టించుకోలేదు' అని ఫుల్‌జాంగ్ గ్రామ పరిస్థితిని ఇఫాఫ్ మయూమ్ పీటీఐకి చెప్పారు. విషాదమేంటంటే... ఈ హింస ఇప్పటికే అమాయకుల ప్రాణాలను బలిగొంది. ఈ నెల మొదటి వారంలో జరిగిన కాల్పులు, బాంబు పేలుళ్లకు ఈ ప్రాంతానికి చెందిన ఆరేళ్ల చిన్నారితో సహా అనేకమంది బలయ్యారు. ఈ ప్రాంత పరిస్థితిని చూసి విసుగు చెందిన మయూమ్ మాట్లాడుతూ... 'మేము ప్రశాంతంగా జీవించడానికి ఆర్మీ, సీఆర్‌పీఎఫ్ లేదా అస్సాం రైఫిల్స్‌ను మా గ్రామంలో మోహరించాలని మేము కోరుకుంటున్నాము' అని అన్నారు. కాగా కాంగ్‌పోక్పి, ఇంఫాల్ వెస్ట్ సమీపంలో నివసిస్తున్న గూర్ఖా సమాజం కూడా ఇదే విధమైన దుస్థితిలో ఉన్నారు. 'మేము శాంతిని కోరుకుంటున్నాము. ఈ ప్రాంతంలో శాంతిని పునరుద్ధరించడానికి ఎవరైనా జోక్యం చేసుకోవాలి' అని సేనాపతి జిల్లాలోని జాతీయ రహదారి 2 సమీపంలో నివసిస్తున్న గ్రామస్థుడు సంజయ్ బిష్ట అన్నారు. చురాచంద్‌పూర్ , బిష్ణుపూర్ మధ్య ఏర్పాటు చేసినట్లుగా తటస్థ జోన్‌లను రూపొందించడానికి భద్రతా దళాలు కృషి చేస్తున్నాయి. అయితే, హింసను అణచివేయడానికి ఇది సరిపోదని నిరూపితమైంది. "మణిపూర్‌కి అల్లర్లు కొత్త కాదు. ప్రతి ఆరు నుంచి ఏడేళ్లకు ఏదో ఒక రకమైన అల్లర్లు జరుగుతూనే ఉన్నాయి. అయితే ఇది మునుపటి అల్లర్ల కంటే ఇప్పుడు జరిగేది పూర్తిగా భిన్నమైంది. సమాజంలో ఇంతటి విభజనను మేము ఎన్నడూ చూడలేదు" అని ఒక భద్రతా అధికారి పీటీఐకి చెప్పారు. అదనపు బలగాల మోహరింపుకు సంబంధించిన ప్రణాళికల గురించి ప్రశ్నించగా... 'రెండు సమాజాల (కుకీ, మెయితీ)నుంచి సమీప భవిష్యత్తులో ఏదైనా సంధిని సూచించే సానుకూల పరిస్థితులు కనబడటం లేదు' అని స్పష్టం చేశారు. కొండలు, లోయలను ఆనుకుని ఉన్న ప్రాంతాలలో సమర్థవంత తటస్థ జోన్లను రూపొందించడానికి తమకు ఎక్కువ మంది సిబ్బంది అవసరమైనప్పటికీ స్థానిక భద్రతాయంత్రాంగం ఏర్పాటు చేయలేకపోయిందని సీఆర్‌పీఎఫ్‌కు చెందిన మరో అధికారి తెలిపారు. 'మేము (సీఆర్‌పీఎఫ్) ప్రభుత్వ పరిధిలోకి వెళ్లి సహాయం చేయవలసి వస్తుంది. మెయితీ, కుకీ సమాజాలకు చెందిన పౌరులు వివిధ విషయాల కోసం మా సహాయాన్ని కోరడం ప్రారంభించారు' అని చురచంద్‌పూర్, బిష్ణుపూర్ మధ్య తటస్థజోన్‌లో మోహరించిన బలగాల ను పర్యవేక్షిస్తున్న అధికారి వెల్లడించారు.

మణిపూర్‌లో ప్రస్తుతం మోహరించిన సైనిక బలగాల్లో అసోం రైఫిల్స్‌కు చెందిన సుమారు 165 కాలమ్స్ (ఒక్కొక్కటి 35-40 మంది సిబ్బందిని కలిగి ఉంటాయి) ఉన్నాయి. అదనంగా, రాష్ట్రంలో 57 కంపెనీలు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్), 48 బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్), , నాలుగు ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) ఉన్నాయి. ఒక్కో కంపెనీలో దాదాపు 100 మంది సిబ్బంది ఉంటారు.

విద్యార్థుల సమస్యలపై తక్షణ చర్యలు

సీఎం జగన్‌కు రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర-విజయవాడ:
రాష్ట్రంలో వసతి గృహాలతో పాటు విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ బుధవారం లేఖ రాశారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ నిర్వీర్యమవుతోందని, విద్యారంగంలో నాడు-నేడు ప్రచారానికే పరిమితమైంది తప్ప ఫలితం ఇవ్వలేదని విమర్శించారు. అధికారంలోకి వస్తే విద్యారంగాన్ని సమూలంగా మార్పు చేసి...మరింతి మెరుగుపరుస్తామని ఎన్నికలకు ముందు జగన్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నాడు-నేడు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసుకుంటున్నప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య నానాటికీ తగ్గిపోతోందని తెలిపారు. 9 వేల ప్రాథమిక పాఠశాలల్లో ఒక్క టీచర్ మాత్రమే ఉన్నారని, 9 నెలల్లోనే 6.41 మంది పిల్లలు ప్రైవేటు స్కూళ్లకు వెళ్లిపోయారని వివరించారు. 3వ తరగతి నుంచే సబ్జెక్టు టీచర్‌తో బోధన అంటూ 3, 4, 5 తరగతులను ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో కలిపారని, మొత్తం 4234 ప్రాథమిక పాఠశాలను ఇతర పాఠశాలల్లో విలీనం చేశారని, అనేక గ్రామాల్లో ఒకటి, రెండు తరగతులు మాత్రమే కొనసాగుతున్నాయని రామకృష్ణ పేర్కొన్నారు. 98 మంది లోపు విద్యార్థులు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలకు సబ్జెక్టు టీచర్లను ఇవ్వలేమని, అక్కడ చదివే విద్యార్థులను వేరే స్కూళ్లలో చేర్చుకోవాలని సాక్షాత్తు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పడం విచారకరమని వ్యాఖ్యానించారు. అమ్మఒడి కోసం తమరు బటన్ నొక్కి 23 రోజులు గడిచినప్పటికీ చాలామంది తల్లుల ఖాతాల్లో నగదు జమ కాలేదని విమర్శించారు. మరికొందరి తల్లుల ఖాతాల్లో రూ.13 వేలకన్నా తక్కువ

మొత్తం జమ అయినట్లు తెలుస్తోందన్నారు. జగనన్న విద్యా కానుకలో పిల్లలకు ఇచ్చే బ్యాగులు, బూట్లు నాసిరకంగా ఉన్నాయని, విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలు సరఫరా జరగడం లేదన్నారు. విదేశీ విద్యాదీవెన అందని ద్రాక్షగా మారిందని, మొత్తం మీద పాఠశాల విద్యా వ్యవస్థ రివర్స్‌లో నడుస్తున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. యూనివర్సిటీలకు వైస్‌చాన్సలర్లుగా తమకు అనుకూలమైన వారిని నియమించారని ఆరోపించారు. యూనివర్సిటీల్లో రాజకీయ జోక్యం పెరిగిందని, వర్సిటీల్లో సమస్యలు వేళ్లూనుకుపోతున్నాయని రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది నియామకాలు లేవని, హాస్టల్ విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు కరువయ్యాయని తెలిపారు. హాస్టల్ విద్యార్థులు ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం ఇచ్చే మెస్, కాస్మొటిక్ చార్జీలు సరిపోక విద్యార్థులు రోడ్డెక్కుతున్నారని తెలిపారు. రాష్ట్రంలోని పాఠశాలలు, యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక, సిబ్బంది ఉద్యోగాలను భర్తీ చేసేందుకు, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని రామకృష్ణ కోరారు.

మిథునం రచయిత శ్రీరమణ కన్నుమూత

విశాలాంధ్ర-హైదరాబాద్:
ప్రముఖ రచయిత, సీనియర్ జర్నలిస్ట్ శ్రీరమణ కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. దిగ్గజాలు బాపు-రమణతో కలిసి పని చేసిన అనుభవం రమణది. పేరడీ రచనలకు శ్రీరమణ ఎంతగానో ప్రసిద్ధి. ఆస్కార్ అవార్డుకు నామినేట్ అయిన మిథునం సినిమాకు శ్రీరమణే కథ అందించారు. 2012లో విడుదలైన ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. దాదాపు సినిమా తీసిన నాటికే పాతిక సంవత్సరాల క్రితం ఆయన రచించిన 25 పేజీల మిథునం కథకు తనికెళ్ల భరణి అద్భుతంగా చిత్రీకరించారు. శ్రీరమణ గుంటూరు జిల్లా, వేమూరు మండలానికి చెందిన వరహాపురం అగ్రహారంలో 1952 సెప్టెంబరు 21న జన్మించారు. ఆయన అసలు పేరు కామరాజ రామారావు. ఆయన అనేక తెలుగు పత్రికలకు పని చేశారు. వ్యంగ్య హాస్య భరితమైన కాలమ్స్ నడిపిన కాలమిస్టుగా, కథకుడిగా, సినిమా నిర్మాణంలో నిర్వహణ పరంగా అనేక విధాలుగా సాహిత్య, కళా రంగాలకు విశిష్ట సేవలందించారు. శ్రీరమణ మృతికి అనేక మంది ప్రముఖులు సంతాపం ప్రకటించారు. శ్రీరమణ మృతికి అరసం జాతీయ ప్రధాన కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, ఆంధ్రప్రదేశ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, వల్లూరి శివప్రసాద్, తెలంగాణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్‌వీ రామారావు, రాపోలు సుదర్శన్ ప్రగాఢ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులు సానుభూతి ప్రకటించారు.

కేంద్రమంత్రి మురళీధరన్‌తో పవన్ భేటీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
ఆంధ్రప్రదేశ్ బీజేపీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మురళీధరన్‌తో జనసేన అధినేత పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. ఈ భేటీలో ఆయనతో పాటు జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ కూడా ఉన్నారు. ఎన్డీఏ కూటమి సమావేశానికి ఢిల్లీ వెళ్లిన పవన్...బుధవారం కేంద్ర మంత్రి మురళీధరన్ ఇంటికి వెళ్లి అల్పాహార విందు చేశారు. ఈ మేరకు బీజేపీ ఏపీ శాఖ ట్వీట్ చేస్తూ ఫొటోలను షేర్ చేసింది. బీజేపీతో పొత్తు, 2024 ఎన్నికల్లో ఎన్డీయే కూటమిని మరింత బలోపేతం చేయడం, తదితర అంశాలపై మురళీధరన్‌తో పవన్ చర్చించినట్లు పేర్కొంది. రాష్ట్ర అభివృద్ధికి ఇది దోహద పడుతుందని పేర్కొంది.

అసైన్డ్ భూముల చట్ట సవరణను పునరాలోచించాలి

సీఎం జగన్‌కు జల్లి విల్సన్, ఆవుల శేఖర్ విజ్ఞప్తి

విశాలాంధ్ర-విజయవాడ:
రాష్ట్రంలో అసైన్డ్ భూముల చట్ట సవరణపై పునరాలోచన చేయడంతో పాటు 9/77 సవరణ చట్టం పక్కాగా అమలు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి లేఖ రాశారు. రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అధ్వర్యంలో అసైన్డ్ భూములపై వివిధ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న చట్టాలు పరిశీలన చేసి, మన రాష్ట్రంలోనూ అసైన్డ్ భూములపై పేదలకు హక్కులు కల్పించాలని ఒక ముసాయిదా తీర్మానాన్ని తయారు చేసినట్లు గుర్తు చేశారు. అయితే పేదలకు అన్ని రకాల ప్రభుత్వ భూములపై యాజమాన్య హక్కులు కల్పించి, రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తూ అమ్ముకునే హక్కు కూడా ఇవ్వాలనే నిర్ణయం వల్ల పేదలకు తీవ్రనష్టం జరుగుతుందని తెలిపారు. రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించడం వలన తమ చేతుల్లో ఉన్న భూములను ఆర్థిక ఇబ్బందుల వలన అమ్ముకొని, పేదలు మళ్లీ నిరాశ్రయులు అయ్యే ప్రమాదం ఉందని వివరించారు. ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరొకసారి పునరాలోచన చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తరపున జల్లి విల్సన్, ఆవుల శేఖర్ కోరారు. పూర్తి యాజమాన్యపు హక్కులు కల్పించడం ద్వారా అసైన్‌మెంట్ పట్టా పొందిన వ్యక్తి మరణిస్తే వారి కుటుంబంలో ఉన్న వ్యక్తులు పట్టా పొందాలంటే రెవెన్యూ ఆఫీసుల చుట్టూ తిరిగే అవకాశం లేకుండా ఉంటుందని, ఇది మంచి పద్ధతి అయినప్పటికీ కేవలం ఆ హక్కులు వారి కుటుంబానికి మాత్రమే రిజిస్ట్రేషన్ చేసే అవకాశం కల్పించాలని సూచించారు. పేదలు ఎవరైనా తమ అవసరాల కోసం అసైన్డ్ భూములు అమ్ముకోదలిస్తే ప్రభుత్వానికే అమ్మాలని, ఇతరులకు విక్రయించరాదనే షరతు పెట్టాలని, తద్వారా పేదలు తమ అవసరాల కోసం అమ్మిన భూమిని ప్రభుత్వమే 2013 భూ సేకరణ చట్టం ప్రకారం కొనుగోలు చేసి ఆ గ్రామంలో ఉన్న ఇతర పేదవాడికి ఆ భూమిని ఇవ్వాలని సూచించారు. అసైన్డ్ భూముల రక్షణ కోసం తెచ్చిన పీఓటీ యాక్ట్ (9/77) చట్టాన్ని యథావిధిగా అమలు చేయాలని కోరారు. కోనేరు రంగారావు భూకమిటీ సిఫారసుల ప్రకారం ఇప్పటికే పేదల అనుభవంలో ఉన్న ఇళ్ల స్థలాలకు, సాగు భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. చాలామంది పెద్దల దగ్గర ఉన్న అసైన్డ్ భూములు సంగతి ఏమిటి? వాటిని వారి నుండి ఎలా తీసుకుంటారు? అనే విషయాన్ని స్పష్టంగా పేర్కొని అలాంటి వారిని గుర్తించి వారి దగ్గర నుంచి అన్ని రకాల ప్రభుత్వ భూములు సేకరించి పేదలకు ఇవ్వాలన్నారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు పక్కాగా అమలు చేస్తే ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గం తీసుకొచ్చిన ముసాయిదా చట్టం అవసరమే ఉండదని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం తెచ్చిన అసైన్డ్ భూముల ముసాయిదా చట్టం పేదలు వ్యతిరేకించక పోవచ్చనే ధీమా ప్రభుత్వానికి ఉండవచ్చని, అయితే పేదల జీవితాలు మారాలని, వారు ఆత్మగౌరవంతో జీవించాలని కోరుకునే ప్రభుత్వమైతే తాము పేర్కొన్న షరతులను పరిశీలనలోకి తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం తెచ్చిన ఈ చట్టం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉంటున్న పెత్తందారులు, పలుకుబడి కలిగిన వారు అసైన్డ్ భూములపై కన్నేసి, ఈ చట్టాన్ని ఆసరా చేసుకుని కొనుగోలు చేసే ప్రమాదం ఉంటుందన్నారు. అలా అయితే పేదల చేతుల్లో భూములు ఉండవని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ కష్టజీవుల చేతుల్లో ఉన్న ఇళ్ల స్థలాలు, సాగు భూములకు అన్ని రకాల హక్కులు కల్పించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- నాలుగేళ్లలో రూ.7,14,631 కోట్లు అప్పు
- బీజేపీ ఏపీ అధ్యక్షురాలు పురంధరేశ్వరి డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగేళ్లలో చేసిన అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైసీపీ ప్రభుత్వ పాలనాతీరుపై ధ్వజమెత్తారు. నేడు ఏపీ అప్పుల ఆంధ్రగా, అంధకార ఆంధ్ర ప్రదేశ్‌గా మారిందన్నారు. ఏపీపై విభజన నాటికి రూ.97 వేల కోట్ల భారం పడగా, ఐదేళ్ల టీడీపీ పాలనలో రూ.2,65,365 కోట్లు అప్పు చేశారని, వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి జులై వరకు నాలుగేళ్లల్లో రూ.7,14,631 కోట్లు అప్పు చేశారని తెలిపారు. రూ.2 లక్షల 39 వేల 716 కోట్లు అధికారికంగా, రూ.4 లక్షల 74 వేల 315 కోట్లు అనధికారికంగా అప్పు తెచ్చినట్లు వెల్లడించారు. ఈ అనధికార అప్పు నేడు ఏపీ అభివృద్ధికి నిరోధకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. లిక్కర్ బాండ్స్ ద్వారా ప్రభుత్వ ఆస్తులు తనఖా పెట్టి, ఉద్యోగులను, ప్రభుత్వ సంస్థలను తాకట్టు పెట్టి ఇష్టారాజ్యంగా అప్పులు చేశారని ఆరోపించారు. చివరకు గ్రామ పంచాయతీ నిధులు, స్టేట్ డిజాస్టర్స్, సింకింగ్ ఫండ్ కూడా దారి మళ్లించేశారని మండిపడ్డారు. ఉద్యోగుల పీఎఫ్, ఈఎస్ఐ నుంచి, జనరల్ పీఎఫ్ నుంచి ఇలా అనేక మార్గాల్లో అనధికారికంగా రూ.4,74,315 కోట్లు తెచ్చారని, ఈ రకంగా తీసుకున్న అప్పులకు దాదాపు రూ.50 వేల కోట్లు వడ్డీ కింద కడుతున్నారని తెలిపారు. అనధికారికంగా తీసుకువస్తున్న అప్పులపై జగన్‌మోహన్ రెడ్డి శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు భరోసా లేకుండా చేశారని, జీతాలు ఎప్పుడు ఇస్తారో కూడా తెలియని దుస్థితి దాపురించిందన్నారు. బీజేపీ ప్రభుత్వం జగన్‌కు అండగా ఉందనేది అపోహ మాత్రమే అని, అధికారికంగా తీసుకున్న అప్పుల వరకే కేంద్రం బాధ్యత అని స్పష్టం చేశారు. ఎన్నికల పొత్తులపై ప్రశ్నించగా, ఆ విషయం కేంద్ర నాయకత్వం చూసుకుంటుందని, రాష్ట్రంలో జనసేన మా మిత్రపక్షమని, త్వరలో పొత్తులపై కూర్చుని మాట్లాడుకుంటామని పురంధరేశ్వరి వెల్లడించారు.

చాగంటి తులసికి బలివాడ పురస్కారం

విశాలాంధ్ర-విజయనగరం:
బలివాడ కాంతారావు స్మారక జీవిత సాఫల్య సాహిత్య పురస్కారాన్ని(2021) ప్రముఖ రచయిత్రి చాగంటి తులసికి ప్రదానం చేయనున్నట్లు భారత నిధి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డీఎస్‌వీ గోపీకృష్ణ, నిర్వాహకులు మేడా మస్తాన్‌రెడ్డి, అడపా రామకృష్ణ బుధవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న ఉదయం 10 గంటలకు విజయనగరంలోని పాల్ నగర్, రోడ్డు నెంబర్ 3లో గల రచయిత్రి తులసి నివాసం వద్ద అందచేస్తారు.

10 మంది బీజేపీ ఎమ్మెల్యేల సస్పెన్షన్

కర్నాటక అసెంబ్లీలో గందరగోళం

బెంగుళూరు:
బెంగుళూరులో జరిగిన విపక్ష పార్టీల సమావేశానికి ఐఏఎస్ అధికారులతో స్వాగతం పలకడంపై అసెంబ్లీలో భారతీయ జనతా పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ఆందోళనకు దిగారు. దీనిపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సమాధానం చెప్పినప్పటికీ వాళ్లు వినిపించుకోకుండా గందరగోళం సృష్టించారు. సభలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఇదిలా ఉంటే... ఆమోదం పొందిన బిల్లుల కాపీలను చింపి కొందరు బీజేపీ ఎమ్మెల్యేలు డిప్యూటీ స్పీకర్ మీద విసిరారు. దీంతో బీజేపీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలను సభ నుంచి సస్పెండ్ చేశారు. వీరిలో డాక్టర్ సీఎన్ అశ్వత్ నారాయణ్, వి.సునీల్ కుమార్, ఆర్.అశోక్, అరగ జ్ఞానేంద్ర, వేదవ్యాస్ కామత్, యశ్ పాల్ సువర్ణ, అరవింద్ బెల్లాడ్, దేవరాజ్ మునిరాజ్, ఉమానాథ్ కొట్యాన్, భరత్ శెట్టి ఉన్నారు. వీరిని మార్షల్స్ సహాయంతో సభ బయటకు తరలించారు. అనంతరం అసెంబ్లీ ఆవరణలోనే వీరు ఆందోళనకు దిగారు. అంతకు ముందు సభలో తీవ్ర గందరగోళం మధ్య ప్రభుత్వం ఐదు బిల్లును ఆమోదించింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐదు బిల్లులు సభలో ఎలాంటి చర్చ లేకుండానే ఆమోదం పొందాయి. ఈ బిల్లులను ఆమోదించిన వెంటనే సభను మధ్యాహ్నానికి వాయిదా వేయకుండా బడ్జెట్ పై చర్చించాలని స్పీకర్ యూటీ ఖాదర్ నిర్ణయించారు. సభా కార్యక్రమాలను చేపట్టాలని డిప్యూటీ స్పీకర్‌ను ఆదేశించారు.

ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ఫీజుల ఖరారుపై

జీవో 24 రద్దు

జగన్ సర్కార్‌కు హైకోర్టులో మళ్లీ చుక్కెదురు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
జగన్ సర్కార్‌కు హైకోర్టులో మరోసారి చుక్కెదురైంది. ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో 25 శాతం తక్కువ ప్రవేశాలు ఉంటే ఫీజుల ఖరారును నిలిపివేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నం. 24ను ఏపీ హైకోర్టు రద్దు చేసింది. ఈ జీవోను సవాల్ చేస్తూ కొన్ని కళాశాలలు పెట్టిన పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానం బుధవారం విచారణ జరిపింది. 25 శాతంలోపు ప్రవేశాల ప్రతిపాదన సరైంది కాదని, దీనికి చట్టబద్ధత లేదని పిటిషనర్ల తరపు న్యాయవాది మతుకుమిల్లి శ్రీవిజయ్ వాదనలు వినిపించారు. చర్యలు తీసుకునే ముందు కళాశాలలకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఏకపక్షంగా జీవో 24ను విడుదల చేశారన్నారు. విద్యాశాఖ తరపున స్టాండింగ్ కౌన్సిల్ సుదేశ్ ఆనంద్ వాదనలు వినిపించారు. ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పించడం లేదని, అందువల్లే ఫీజుల ఖరారును నిలిపివేశారని ఆనంద్ తెలిపారు. విద్యార్థులు తక్కువగా ఉంటే యాజమాన్యానికి సమస్యగానీ ప్రభుత్వానికి వచ్చే నష్టమేమిటని హైకోర్టు ప్రశ్నించింది. ప్రైవేట్ విద్యాసంస్థల్లో గతంలో ఇటువంటి పరిస్థితి లేదని గుర్తుచేసింది. ప్రభుత్వ కళాశాలలు, యూనివర్సిటీలు జాతీయ ర్యాంక్‌కు దూరంగా ఉన్నాయని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ కళాశాలల్లో ఒప్పంద పద్ధతిలో పనిచేసే వారు ఎక్కువని పేర్కొంది. కళాశాలలను ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు పెట్టాలని ఆదేశిస్తూ జీవో నంబరు 24ను హైకోర్టు రద్దు చేసింది.

రిషికొండ అక్రమ నిర్మాణాలపై విచారణ 26కి వాయిదా

విశాఖలోని రుషికొండ నిర్మాణాలపై విచారణ వచ్చే బుధవారానికి వాయిదా పడింది. నిర్మాణాలు నిలిపివేసేలా ఆదేశాలివ్వాలని అనుబంధ పిటిషన్ దాఖలైంది. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలు ఆపాలని పిటిషనర్ కోరారు. ఇప్పటికే నిర్మాణాలపై కేంద్ర అటవీ పర్యావరణ కమిటీ విచారణ నివేదిక ఇచ్చిందని, కమిటీకి నిర్ణయం తీసుకునేలా ఆదేశాలివ్వాలని పిటిషనర్ న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. అనుబంధ పిటిషన్‌పై ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయలేదని కోర్టు దృష్టికి పిటిషనర్ తీసుకువెళ్లారు. దీంతో కౌంటర్ దాఖలుకు ప్రభుత్వం తరపు న్యాయవాది వారం గడువు కోరగా హైకోర్టు సానుకూలంగా స్పందించింది. తదుపరి విచారణను ఈనెల 26వ తేదీకి వాయిదా వేసింది.



Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.